



మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్-మంగళవారం 30 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 175 | పేజీలు:12 | వెల రూ.5







# హరీష్‌కు మెంటలా?

## అసెంబ్లీని ఎందుకు రద్దు చేయాలి



- ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు
- ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను శిక్షిస్తున్నరు
- బిజేపీది ఆశకాదు.. అత్యాశ
- అధికారం కోసం పగటికలలు
- వారం రోజుల్లో రైతు భరోసా నిధులు జమచేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,జూన్ 29(మనం,ప్రత్యేక ప్రతినిధి): బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారని, రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తామన్నారు. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉందని, గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బీఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయని ఎద్దేవ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ...మిగతా 2లో

# ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త రూల్స్

- ఇక.. జీతంలో 1.5% కట్.!
- మే నుంచే ఈహెచ్ఎస్ కోత అమలు
- భార్యాభర్తలు ఉద్యోగులైతే ఒక్కరికే కోత
- ఉద్యోగుల ఆరోగ్య నిధికి మ్యాచింగ్ గ్రాంట్

హైదరాబాద్, జూన్ 29(మనం, ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు , వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ కోసం అమలవుతున్న 'ఉద్యోగుల ఆరోగ్య పథకం' (ఈహెచ్ఎస్) నిధుల సమకూర్పుపై రాష్ట్ర ఆర్థిక శాఖ సరికొత్త ఉత్తర్వులను జారీ చేసింది. జూన్ 29, 2026 నాటి ...మిగతా 2లో

### పెండింగ్...క్లియరెన్స్

# ఉద్యోగులకు రూ.2,000 కోట్లు విడుదల

- రెండో విడత నిధులకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు
- మొత్తం రూ.4,000 కోట్ల బకాయిల క్లియరెన్స్
- దశలవారీగా బకాయిలన్నీ చెల్లిస్తం

హైదరాబాద్,జూన్ 29(మనం,ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తీపి కబురు అందించింది. గత కొంతకాలంగా ...మిగతా 2లో



# సీఎం కలను... సాకారం చేస్తం



## మూసి పునరుజ్జీవం..చారిత్రాత్మకం

## ప్రపంచ స్థాయి నగరంగా..భాగ్యనగరం

- మూసీ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తుకు పునాది
- అభివృద్ధి-మానవీయత రెండింటినీ ప్రాధాన్యం
- భూ సేకరణ, పునరావాసంపై మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్,జూన్ 29(మనం,ప్రత్యేక ప్రతినిధి): హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్‌రెడ్డి కలను సాకారం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు సంబంధించి భూ సేకరణ, పునరావాసం అంశాలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం మంత్రి పొంగులేటి ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూసి నదిని పునరుజ్జీవింపజేసి, దాన్ని పర్యాటకం, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. మూసి నది పునరుజ్జీవంతో నగరానికి కొత్త జీవం పోసేలా, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా రూపుదిద్దుకుంటోందన్నారు. ఈ ప్రాజెక్ట్ కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన జీవన వాతావరణాన్ని అందించే సంకల్పమని వివరించారు. మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్ తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధికి, ...మిగతా 2లో



# పర్యాటక, సాంస్కృతిక బంధాల బలోపేతం

## తెలంగాణకు ఫ్రెంచ్ పర్యాటకులకు చేరువ చేద్దాం

## మంత్రి జూపల్లిని కలిసిన ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్



**హైదరాబాద్, జూన్ 29(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియోలు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ క్రమంలో తెలంగాణ-ఫ్రాన్స్ మధ్య పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పెట్టుబడులు, ప్రజల మధ్య పరస్పర సంబంధాల బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఉందని, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతూనే తన సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించుకుంటోందన్నారు. తెలంగాణ పర్యాటక విశేషాలను ఫ్రాన్స్‌లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం, ఫ్రెంచ్ ఎంబసీ, పర్యాటక సంస్థలు భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు.

ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, పరస్పర పర్యటనలను మరింత విస్తరించాలని సూచించారు. తెలంగాణ-ఫ్రాన్స్ మధ్య ఉన్న సాంస్కృతిక సారూప్యతలు, వారసత్వ పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి అవకాశాలను గుర్తించేందుకు సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ప్రతిపాదించారు. దీని వల్ల ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారానికి బాటలు పడతాయని తెలిపారు. ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ మాట్లాడుతూ పర్యాటకం దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు కీలక రంగమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా సందర్శించే దేశాల్లో ఫ్రాన్స్ ఒకటని, ప్రతి సంవత్సరం 10 కోట్లకు పైగా అంతర్జాతీయ పర్యాటకులు ఫ్రాన్స్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. పర్యాటకం, సంస్కృతి రంగాల అభివృద్ధి ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయని చెప్పారు. భారత్-ఫ్రాన్స్ మధ్య రక్షణ, ఔషధ తయారీ, సాంకేతిక రంగాల్లో బలమైన భాగస్వామ్యం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో సుమారు 200 మంది ఫ్రెంచ్ పౌరులు నివసిస్తున్నారని తెలిపారు. తెలంగాణతో పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ రంగాల్లో మరింత సహకారానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ఫ్రెంచ్ పర్యాటకులకు మరింత చేరువ చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# హరీష్‌కు మెంటలా?

(మొదటి పేజీ తరువాయి)

ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారని మంత్రి పొంగులేటి అన్నారు. తన నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయని, బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించనన్నారు. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్రు కాల్చి వాత పెడతానని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదని, ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టేన్నారు. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని, తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదన్నారు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురామని వివరించారు.

**ఆశకాదు..అత్యాశ:**

తెలంగాణలో అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోందని, ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోందని మంత్రి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోందని, బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలన్నారు.

కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందని, కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు.

భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్దంగా ఉన్నామని, తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగిందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు ట్రంప్ కీలక ప్రకటన

**వాషింగ్టన్, జూన్ 29:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాజా అంశాలపై చర్చించేందుకు రావాలని ఇరాన్ కోరిందన్నారు. టెహ్రాన్ అభ్యర్థన మేరకు ఖతార్ రాజధాని దోహా వేదిగా మంగళవారం సమావేశం ఉంటుందని సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. ఇరుదేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో తుది ఒప్పందంపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఖతార్లో ఈ వారం ఇరాన్-అమెరికా బృందాల మధ్య సమావేశాలు నిర్వహించే ప్రణాళికలేవీ లేవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరిబబాడి పేర్కొన్నారు.

# ఉద్యోగులకు రూ.2,000 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిల చెల్లింపుల కోసం కాంగ్రెస్ సర్కార్ తాజాగా మరో రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ఈ బకాయి నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే గత నెల 29వ తేదీన మొదటి విడత కింద రూ. 2,000 కోట్ల బకాయి నిధులను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా విడుదల చేసిన రెండో విడత రూ. 2,000 కోట్లతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ. 4,000 కోట్ల ఉద్యోగుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసినట్లయింది. దశలవారీగా అన్ని రకాల ఉద్యోగ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అధికార వర్గాలు వెల్లడించాయి.

**నెలలోనే రూ.4వేల కోటు:**

ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులు, వారి న్యాయమైన డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిధులను విడతల వారీగా విడుదల చేస్తోంది. గత నెల 29న మొదటి విడత కింద రూ.2,000 కోట్ల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా నేడు మరో రూ. 2,000 కోట్లు విడుదల చేయడంతో.. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ. 4,000 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించినట్లయింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పీఎఫ్, జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, మెడికల్ బిల్లులతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ నిధుల చెల్లింపులకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ ఈ ఆర్థిక ప్యాకేజీపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శిథిలాల కిందే అతడి ఆశలు గల్లంతు

- భూకంపంలో కుటుంబాన్ని కోల్పోయిన అర్జెంటీనా ఫుట్‌బాలర్



**కారకస్, జూన్ 29:** వెనెజువెలాలో ఇటీవల సంభవించిన జంట భూకంపాలు ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ విపత్తులో అర్జెంటీనా ఫుట్‌బాలర్ లుకాస్ ట్రెజో తన కుటుంబాన్ని కోల్పోయారు. భవనం కూలిపోవడంతో భార్య, ఇద్దరు పిల్లలు శిథిలాల కింద నలిగిపోయారు. వారి మరణాన్ని ఫుట్‌బాల్ క్లబ్ 'డిపోర్టివో లా గువేరా' ధ్రువీకరించింది.

ఈ భూకంపం ధాటికి వెనెజువెలాలోని యారకూ ప్రాంతం అతలాకుతలమైంది. అక్కడ పలు భవనాలు నేలమట్టమయ్యాయి. లుకాస్ కుటుంబం ఉన్న భవనం కూడా కూలడంతో అతడి భార్య యానినా మారనెల్లా, ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఆ ముగ్గురు శిథిలాల కింద ప్రాణాలు విడిచారు. అప్పుడు ఫుట్‌బాలర్ తన టీమ్‌తో వేరే ప్రాంతంలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. భూకంపం తర్వాత తన భార్య, పిల్లలు గల్లంతయ్యారన్న వార్త వినగానే షాక్కు గురైన లుకాస్.. అక్కడకు చేరుకొని తన కుటుంబం కోసం శిథిలాలను తొలగిస్తూ వెతకడం ప్రారంభించాడు. వారిని ఎలాగైనా ప్రాణాలతో గుర్తించాలని అతడు చేసిన ప్రయత్నం తోటివారిని కంటతడి పెట్టించింది.

ఇదిలా ఉండగా.. భూకంపం ధాటికి అతలాకుతలమైన వెనెజువెలాకు బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాలర్ నెయ్మర్ ఆపన్న హస్తం అందించాడు. 2,50,000 డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.2.35 కోట్లు) విరాళంగా ప్రకటించాడు. ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆహారం, తాగునీరు, వైద్యసహాయం అందించేందుకు ఈ నిధులను ఉపయోగించనున్నారు.

## నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

- తొలివిడతలో 41.37 లక్షల మందికి లబ్ధి
- 10 రోజుల్లో అందరికీ నిధులు

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్,జూన్ 29(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. నేటి నుంచి రైతుల ఖాతాల్లో నిధుల జమ చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయంగా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని మంత్రి చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అందరికీ నిధులు జమచేస్తామన్నారు.రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో 'రైతు ఆశీర్వాద సభ'ను నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించిందని, తొలి విడత నిధులు జమ చేయాలని ప్లాన్ చేయడం జరిగిందన్నారు. అయితే ఖమ్మంలో కురిసిన భారీ వర్షం కారణంగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభను ప్రభుత్వం రద్దు చేశామన్నారు. కాగా రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారన్నారు. ఈ సదస్సు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుందన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతా వారికి దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త రూల్స్

(మొదటి పేజీ తరువాయి)

అధికారిక జీవో నం.79 ప్రకారం ఇకపై ప్రతి ఉద్యోగి మూల వేతనం, పెన్షనర్ల మూల పింఛను నుండి ప్రతి నెలా 1.5 శాతం మొత్తాన్ని ఈ ఈహెచ్ఎస్ హెల్త్ ఫండ్‌కు విరాళంగా కట్ చేయనున్నారు. మే 2026 నెలకు సంబంధించిన జీతాలు, పెన్షన్ల (జూన్‌లో చెల్లించేవి) నుంచే ఈ కోత ప్రక్రియ ప్రారంభం కానుంది.

**ఒకే ఇంట్లో ఇద్దరు ఉద్యోగులుంటే:**

ఒకే ఇంట్లో భార్య,భర్తలు ఉద్యోగులైన వారిపై అదనపు భారం పడకుండా, ఎక్కడా డబుల్ కటింగ్ జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. భార్యాభర్తలు ఇద్దరూ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పుడు, వారిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి మరొకరు ప్రభుత్వ పెన్షనర్‌గా ఉన్నప్పుడు కేవలం ఒక్కరి జీతం నుండి మాత్రమే ఈ మొత్తాన్ని మినహాయిస్తారు. అలాగే ఒకే వ్యక్తి ప్రభుత్వ సర్వీస్ పెన్షన్ , ఫ్యామిలీ పెన్షన్.. ఇలా రెండు పింఛన్లు పొందుతున్నప్పుడు కూడా ఒకే ఒక కోతకు నిబంధనలను పరిమితం చేశారు. ఇలాంటి సందర్భాలలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్-హెచ్ఆర్ఎంఎస్ సిస్టమ్లో పక్కాగా నమోదు చేసి, పొరపాటున కూడా రెండోసారి కటింగ్ అవ్వకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ఇప్పటికే ఎవరికైనా ఇలా అదనంగా డబ్బులు కట్ అయి ఉంటే, ఆ మొత్తాన్ని తిరిగి రీఫండ్ చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**హెల్త్ కేర్ ట్రస్ట్ :**

ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత సమర్థవంతంగా నడిపించేందుకు గానూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్‌పర్సన్‌గా ఒక ప్రత్యేక బోర్డ్ ఆఫ్ ట్రస్టీలతో కూడిన 'న్యూ ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్'ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈ బోర్డులో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉంటారు.

# సీఎం కలను... సాకారం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే చారిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**దశబ్దాలుగా:**

మూసి నది కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో పరివాహక ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని మంత్రి తెలిపారు.

వరద నియంత్రణ, నీటి శుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాలు ఏర్పాటు ద్వారా మూసి పరివాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. గతంలోనే ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్టుగా మూసి ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గుర్తు చేశారు.

**మానవీయ కోణంలో:**

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పేదల జీవితాలు దెబ్బతినకుండా ప్రతి నిర్ణయం మానవీయ కోణంలోనే తీసుకుంటామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భూ సేకరణ ప్రక్రియలో ప్రజా కోణంలో ఆలోచించి మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలని ఇందుకు అవసరమైన క కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు.భూములు కోల్పోయే వారికి చట్టబద్ధమైన పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడబోదని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈ.వి.నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## 24 గంటల్లో మూడు శిఖరాలు ఎక్కిన బ్రిటన్ యువరాణి



**లండన్, జూన్ 29:** బ్రిటన్ యువరాజు విలియమ్ సతీమణి, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేట్ మిడిల్టన్ సరికొత్త ఘనత సాధించారు. కేవలం 24 గంటల్లోనే మూడు శిఖరాలను అధిరోహించారు. ఏడాది క్రితమే క్యాన్సర్ నుంచి కోలుకున్న ఆమె .. ఓ ఛారిటీ కోసం ఈ శిఖరాలను ఎక్కారు. ఈ విషయాన్ని రాజకుటుంబానికి చెందిన సోషల్ మీడియా ఖాతాలో ఆమె పంచుకున్నారు.'నేషనల్ త్రీ పీక్స్ ఛాలెంజ్'లో భాగంగా కేట్ మిడిల్టన్ ఈ శిఖరాలను అధిరోహించారు. 24 గంటల వ్యవధిలో స్కాట్లాండ్‌లోని బెన్ నెవిస్, ఇంగ్లాండ్‌లోని స్కాఫెల్ పీక్, వేల్స్‌లోని స్నోడౌన్ శిఖరాలను ఎక్కారు. మొత్తం 37 కిలోమీటర్ల ట్రెక్కింగ్ చేసి ఆమె ఈ ఛాలెంజ్‌ను పూర్తి చేశారు. ''క్యాన్సర్ కేవలం శరీరంపై మాత్రమే ప్రభావం చూపించదు. మన ఆలోచనా విధానాన్ని మార్చేస్తుంది. ఇది నేను వ్యక్తిగతంగా తెలుసుకున్నా. క్యాన్సర్ నుంచి బయటపడాలంటే కేవలం మందులొక్కటే సరిపోవని అర్థం చేసుకున్నా. అందుకే ఈ ఛాలెంజ్‌ను స్వీకరించా. ఆ మహమ్మారి నుంచి బయటపడిన తర్వాత జీవితం ఎలా ఉంటుందనేది తెలుసుకునేందుకే ప్రయత్నించా'' అని కేట్ ఈ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

''క్యాన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఛాలెంజ్‌లో పాల్గొన్నా. ఈ వ్యాధి నుంచి కోలుకోవడం అంటే కేవలం ఆరోగ్యంగా మారడం మాత్రమే కాదు.. జీవితం ఎంత సమతుల్యంగా ఉండాలో అర్థం చేసుకోవడం కూడా..! ప్రయత్నం, అంగీకారం, నమ్మకం, ఆలోచన ఉంటేనే దీన్నుంచి బయటపడగటం. చివరగా.. మనం జీవితంలో ముందుకెళ్లాలంటే ధైర్యం ఒక్కటే సరిపోదు. మనం ప్రయాణిస్తున్న మార్గంలో ఎన్ని అడ్డుంకులు ఎదురైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నిలకడగా ఉంటేనే సాధ్యమవుతుంది'' అని తెలిపారు.

తాను క్యాన్సర్ బారిన పడినట్లు 2024 మార్చిలో కేట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ప్రజా జీవితానికి దూరంగా ఉన్న ఆమె.. ఆసుపత్రిలో పలు దశల వారీగా కీమోథెరపీ చేయించుకున్నారు. ఈ మహమ్మారి నుంచి తాను పూర్తిగా బయటపడినట్లు గతేడాది జనవరిలో వెల్లడించారు. అప్పటి నుంచి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# రాష్ట్రంలో బదిలీల జాతర

- 12 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం
- సీనియర్ ఐపీఎస్‌లకు అదనపు బాధ్యతలు
- 36 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి
- భారీగా ఐఎఫ్ఎస్ బదిలీలు

**హైదరాబాద్,జూన్ 29(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో బదిలీల జాతర మొదలైంది. సీఎంఓ కార్యాయలంలో ఒకవైపు ప్రక్షాళన పర్వం సాగుతున్న క్రమంలో పోలీసు శాఖలోనూ 12 సీనియర్ ఐపీఎస్‌లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టి ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయించింది.

**ఐపీఎస్‌లకు అదనపు బాధ్యతలు:**

రాష్ట్రంలోని రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝాకు డీఐజీ, జోన్-1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు.అలాగే హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్-5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్-3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ (లా అండ్ ఆర్డర్) జాయింట్ కమిషనర్ ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్గా నియమిస్తూ, డీఐజీ జోన్-4 (భద్రాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీగా కొనసాగుతున్న ఆర్. భాస్కరన్‌ను జోన్-2 (బాసర) డీఐజీ అదనపు బాధ్యతలు కేటాయించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) అదనపు బాధ్యతలు అప్పగించారు.ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సింధు శర్మను ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా ఉన్న చెన్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్‌లను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సీఏఆర్ హెడ్క్వార్టర్స్ డీసీపీగా నియమించారు.అలాగే వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న బి. రాములు నాయక్ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.




**ఐఎఫ్ఎస్‌ల బదిలీ:**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలనా పరమైన కారణాలతో పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు అందరూ తక్షణమే తమ పాత విధులను వదిలి, కొత్తగా కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు.ఈక్రమంలో ప్రస్తుతం పోస్టింగ్ కోసం నిరిక్షిస్తున్న వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్ ప్రభుత్వం అరణ్య భవన్‌లో కీలక బాధ్యతలు అప్పగించింది . హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కార్యాలయంలో ఆయనను కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ప్లానింగ్ అండ్ విజిలెన్స్) గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.అదే విధంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు కొత్త అటవీ అధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం బదిలీల జాబితాను విడుదల చేసింది.

# ప్రణాళికా బద్ధంగా ఆర్థిక వ్యవస్థ

## 2034 నాటికి 1 ట్రిలియన్, 2047కి 10 శాతం రెట్టింపు

## ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూన్ 29,(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఒక ప్రతిష్ఠాత్మక ప్రణాళికను ప్రకటించారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్‌కు, భారత స్వాతంత్ర్య శతవార్షికోత్సవం జరిగే 2047 నాటికి 3 ట్రిలియన్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు.ఇటీవల మంత్రి జాతీయ వీడియో మాట్లాడుతూ తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో దాదాపు 5% వాటాను అందిస్తోందని, 2047 నాటికి ఈ వాటాను 10%కి రెట్టింపు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాలన, పరిశ్రమలు, అట్టడుగు స్థాయి ఆర్థిక కార్యకలాపాలలో నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం కీలకమని ఆయన పేర్కొన్నారు.

**21వేల కోట్ల రుణాలు :**

రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా భాగమని, వీరికి ఈ ఏడాదే రూ. 21,000 కోట్ల రుణాలు అందించామని, ఎన్పీఏలు దాదాపు సున్నా స్థాయిలో ఉన్నాయని మంత్రి తెలిపారు.పెట్టుబడిదారుల విశ్వాసానికి రెండు ప్రధాన అంశాలు కారణమని, రాజకీయ పార్టీలు మారినా కొనసాగుతున్న విధాన స్థిరత్వం, సులభతర వాణిజ్య నిర్వాహణ పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయని చెప్పారు. టీఎస్ఐ పీఏఎస్ఎస్ సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు 21 రోజుల్లోనే మంజూరవుతున్నాయని, ఇప్పుడు ఈసీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0' ద్వారా సాంకేతికత సహాయంతో మరింత పారదర్శకత, పెండింగ్ అనుమతుల రియల్-టైమ్ ట్రాకింగ్ అందుబాటులోకి వచ్చిందన్నారు. 1950-70వ దశకాలలో స్థాపించిన సంస్థల ఆధారంగా అభివృద్ధి చెందిన తెలంగాణ రక్షణ, ఏరోస్పేస్ రంగం ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులను మించిపోయిందని మంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్, రాబోయే రీజినల్ రింగ్ రోడ్, వరంగల్, ఆదిలాబాద్‌లో నిర్మిస్తున్న కొత్త విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా జిల్లా కేంద్రాలకు హైదరాబాద్ స్థాయి కనెక్టివిటీని విస్తరించనున్నట్లు తెలిపారు.



**కాలుష్య రహిత నగరం:**

హైదరాబాద్‌లో దాదాపు 30,000 ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నెట్-జీరో, కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేయనున్నామని మంత్రి తెలిపారు. ఇందులో 200 ఎకరాల్లో ఏఐ సిటీ, గ్రీన్ ఫార్మా యూనిట్లు, అన్ని తరగతుల వారికి నివాస ప్రాంతాలు, దేశంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో మొదటి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఉంటాయన్నారు. ఎంఎస్ఎంఇల విషయంలో వచ్చే ఐదేళ్ల కోసం రూ. 600 కోట్లు కేటాయించినట్లు, ప్రతి జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు.

భూమి కొనుగోలు చేయకుండా లీజుకు తీసుకునే విధానాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కొత్త పార్క్ స్థలంలో నాలుగో వంతు మహిళా పారిశ్రామికవేత్తలకు కేటాయించనున్నామన్నారు. తమ ప్రభుత్వం 'నియంత్రణాధికారిగా కాకుండా సహాయకారిగా' వ్యవహరిస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. అత్యున్నత శ్రేణి మౌలిక సదుపాయాలు, డిజిటల్ సన్నద్ధత, విధాన స్థిరత్వాలు అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిలో తెలంగాణను విభిన్నంగా నిలబెడుతుందన్నారు.

# సీఎంను కలిసిన క్రియేటివ్ డైరెక్టర్



హైదరాబాద్,జూన్ 29(మనం,ప్రత్యేక ప్రతినిధి) : సమాచార పౌరసంబంధాల శాఖలో క్రియేటివ్ డైరెక్టర్ గా నియమితులైన రాజు కొండా సోమవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం సమాచారశాఖలో ఆయన సేవలను వినియోగించుకునేందుకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు ప్రభుత్వానికి సేవలు అందించనున్నారు. తన నియామకానికి సహకరించిన గౌరవ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జులై 1 నుంచి ఐటీఆర్ కొత్త రూల్స్

## ఐటీఆర్ నుంచి ఆధార్, క్రెడిట్ కార్డుల వరకు.. దాఖలుకు జులై 31 గడువు

### ఆధార్‌లో ఈ-మెయిల్ అప్‌డేట్ 6 నెలలు ఉచితం

హైదరాబాద్, జూన్ 29, మనం ప్రతినిధి : కొత్త నెల ఆ(ప్రా)రంభం కానుందంటే ఆర్థికంగా కొన్ని కీలక మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. డబ్బు, బ్యాంకింగ్, పన్నులు, క్రెడిట్ కార్డులకు సంబంధించి ఏదో అప్‌డేట్ ఉంటూ ఉంటుంది. ఈ క్రమంలో జులై 1 నుంచి ఆధార్ నుంచి పాస్‌పోర్ట్, ఐటీఆర్ నుంచి క్రెడిట్ కార్డుల వరకు పలు కొత్త మార్పులు అమల్లోకి రానున్నాయి.

**ఐటీఆర్ గడువు..**

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నులు జులై 31లోపు దాఖలు చేయాలి. ఐటీఆర్-1, ఐటీఆర్-2 దాఖలు చేసే వారికి ఈ గడువు వర్తిస్తుంది. ఆలస్యమైతే జరిమానా పడే అవకాశం ఉంది. కొన్ని పన్ను ప్రయోజనాలు కూడా కోల్పోవచ్చు. కాబట్టి చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే రిటర్నులు దాఖలు చేయడం మంచిది.

**ఉచితంగా.. ఆధార్ ఈ-మెయిల్ అప్‌డేట్**

ఆధార్ వినియోగదారులకు ఇది శుభవార్త. ఆధార్‌లో నమోదైన ఈ-మెయిల్ చిరునామాను మార్చుకోవడానికి ఇకపై రూ.75 చెల్లించాల్సిన అవసరం లేదు. ఆధార్ మొబైల్ యాప్ ద్వారా ఈ సేవను ఉచితంగా పొందవచ్చు. ఈ సదుపాయం 2026 డిసెంబర్ 31 వరకు అందుబాటులో ఉంటుంది.

**కొత్త రూల్స్‌తో.. నో రివార్డ్స్..**

ఫోన్ పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల రివార్డు పాయింట్ల విధానంలో మార్పులు వస్తున్నాయి. కొన్ని లావాదేవీలపై ఇకపై రివార్డు పాయింట్లు ఇవ్వరు. అలాగే ఖర్చులు నిర్దేశిత పరిమితి దాటితేనే పాయింట్లు లభిస్తాయి. ఈ మార్పులు ఎంపిక చేసిన కార్డులకు మాత్రమే వర్తిస్తాయి.

**హెచ్‌డీఎఫ్‌సీ కొత్త షరతులు..**

హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు వినియోగదారులకు




ఎయిర్ పోర్ట్ లాంజ్ సదుపాయంపై కొత్త నిబంధన అమల్లోకి వస్తుంది. ఒక త్రైమాసికంలో మూడు ఉచిత లాంజ్ సందర్శనలు పొందాలంటే.. అంతకుముందు త్రైమాసికంలో కనీసం రూ.60 వేలు ఖర్చు చేసి ఉండాలి.

**పీరం కానున్న పాస్ పోర్ట్ సేవలు..**

జులై 1 నుంచి పాస్‌పోర్ట్ ఫీజులు పెరగనున్నాయి. సాధారణ, తత్కాల్ పాస్‌పోర్ట్‌కు కొత్త రుసుములు అమల్లోకి వస్తాయి. దేశీయంగా, విదేశాల్లో దరఖాస్తు చేసుకునే వారందరికీ ఈ మార్పులు వర్తిస్తాయి.

**బ్యాంకుల్లో బలవంతపు భీమాకు చెక్?..**

బ్యాంకులు అవసరం లేని బీమా, పెట్టుబడి ఉత్పత్తులను బలవంతంగా విక్రయించకుండా ఆర్‌బీఐ కొత్త నిబంధనలు తీసుకొస్తోంది. జులై 1 నుంచే ఈ మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి. కస్టమర్ల ప్రయోజనాలను కాపాడడమే దీని ఉద్దేశం.

# ఆయన అపర దానకర్ణుడు

## ప్రజల్లో ఆయన ఆదరణ అలాంటిది

## మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 29, మనం ప్రతినిధి : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. మునుగోడులో పెద్ద దానకర్ణుడు ఉన్నారంటూ తన సోదరుడు రాజగోపాల్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఓ మహిళ తన గోడు చెప్పుకునేందుకు మంత్రి వద్దకు రాగా.. ఆమెతో సరదాగా మాట్లాడుతూ.. ఆయన చమత్కరించారు. ఆయన ఉండగా.. తాను ఏం చేయగలను అంటూ వ్యాఖ్యానించారు. ఇక, తెలంగాణ రాజకీయాల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే పరిచయం అక్కర్లేని వ్యక్తులుగా ప్రజల్లో ప్రజాధరణ ఉంది. గతంలోనూ మంత్రిగా పనిచేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యనేతగా కొనసాగిన విషయం తెలిసిందే. అయితే, ఈ దఫా ఆయన సోదరుడు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు. వీరిద్దరూ రాజకీయాల్లోనే కాకుండా దాతృత్వంలోనూ ఎప్పటికప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తూ ఉంటారు. వారి చేసే కామెంట్స్, వీడియో సైతం ఇప్పుడు నెట్టింట తీవ్ర వైరల్‌గా అవుతోంది.

నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కోమటిరెడ్డి బ్రదర్స్ పేరు బాగా వినిపిస్తుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు భారీగా ఫాలోయింగ్ ఉంటుంది. ఈ కోమటిరెడ్డి సోదరులకు ఉన్న ఫాలోయింగ్‌తోనే నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. రాజకీయాల్లోనే కాకుండా ప్రజలను ఆర్థికంగా ఆదుకుంటూ, ఎన్నో మంచి పనులు చేస్తూ.. ఈ ఇద్దరు నేతలు ప్రజల గుండెల్లో నిలుస్తు(ంటారు)న్నారు. అయితే, తన కుమారుడి మరణం తర్వాత కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ప్రతీక్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి.. ప్రజలకు ఆర్థిక, విద్య, సామాజిక సేవ చేస్తూ.. ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా తన సోదరుడిని ఉద్దేశించి.. తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఒక ఇంట్రెస్టింగ్ ఘటన చోటుచేసుకుంది. మునుగోడు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ.. తనకు ఉన్న ఆర్థిక ఇబ్బందులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వివరించింది. తనకు సహాయం చేయాల్సిందిగా మంత్రిని వేడుకుంది. దీనిపై మంత్రి సరదాగా స్పందించారు. మీ మునుగోడులో పెద్ద దానకర్ణుడు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నారు కదా? అని పేర్కొన్నారు. ఆయన ఉండగా నేనెలా? మీకు ఉపయోగపడతాను? అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నవ్వుతూ చమత్కరించారు.

ఇక ఆ మహిళ చేసిన విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి వెంకటరెడ్డి.. తాను రూ.50 వేలు, రూ.లక్ష ఇస్తే అసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. మహిళతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడిన సంభాషణకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అక్కడ రాజగోపాల్ రెడ్డి అన్నీ చూసుకుంటాడని.. అయితే తన వద్ద డబ్బులు లేవని పేర్కొన్నారు. మంత్రిగా ఉన్న తానే ప్రభుత్వం ఇచ్చిన క్వార్టర్స్‌లో ఉంటున్నానని.. రాజగోపాల్ రెడ్డి వద్దకే వెళ్లి గోడు చెప్పుకోండి అని సూచించారు. ఆ తర్వాత ఆమెకు ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.50 వేల ఆర్థిక సహయం అందేలా చేశారు.

# వచ్చేది మోదీ సర్కార్

## యువతకు కాంగ్రెస్ మొండి చెయ్యి



- డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- దేశ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోంది.
- హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా

హైదరాబాద్,జూన్29(మనం న్యూస్): తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, 'డబుల్ ఇంజిన్ సర్కార్' వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు మారుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టంచేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఘట్‌కేసర్ సమీపంలో జరిగిన 'వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ.. 'ప్రస్తుత యువతరం దేశ వ్యతిరేక ఆలోచనలతో కాకుండా, దేశ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోంది.

కొందరు క్రీడల్లో, మరికొందరు స్టార్టప్‌లతో తమ భవిష్యత్తును, దేశ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. దేశంలో 2.25 లక్షల మంది యువత స్టార్టప్‌ల ద్వారా ఉద్యోగ సృష్టికర్తలుగా మారారు' అని అన్నారు. దేశ రాజ్యాంగాన్ని, సంస్కృతిని ప్రశ్నించేవారు నిజమైన యువతరం కాదని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే దేశంలో రెండులక్షలకు పైగా స్టార్టప్‌లు, 125కు పైగా యునికార్న్‌లు ఆవిర్భవించాయని తెలిపారు. 'నేటి యువత ఉద్యోగాలు సృష్టించే వారిగా మారుతున్నారు. వారి ఆవిష్కరణలు, సామర్థ్యాలు దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి' అని వివరించారు. యువతరాజకీయాల్లోకి రావాలని, స్పష్టమైన లక్ష్యంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**యువతకు కాంగ్రెస్ మొండి చెయ్యి:**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై నితిన్ నబిన్ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర యువతకు ఉపాధి, అభివృద్ధి వంటి కీలక హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ, నైపుణ్యం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.నిర్ణయాత్మక నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆయన బీహార్ అనుభవాన్ని పంచుకున్నారు. '2005లో బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ,నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటికే చాలాకాలంగా ఉన్న డీజీపీనే కొనసాగించారు. అయితే, నాయకత్వం మారడంతో అదే డీజీపీ ఒకటిన్నర సంవత్సరాల్లో బీహార్‌లో శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చారు.

దీన్నిబట్టి సమర్థవంతమైన నాయకత్వం ఉంటే వ్యవస్థ ఎంతలా మారుతుందో అర్థం చేసుకోవచ్చు' అని ఉదహరించారు.సోషల్ మీడియా వాడకం పెరగడంతో ప్రజల్లో చైతన్యం పెరిగిందని, నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తుంచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్లు ఉన్న ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారం అందించాలి

- ప్రతి ఓటర్ పాస్ పోర్ట్ సైజ్ ఫొటో బీఎల్ఓలకు ఇవ్వాలి
- ఫారాలు నింపడంలో సహాయం చేసి.. సేకరించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



రాజన్న సిరిసిల్ల, జూన్ -29(మనం ప్రతినిధి ): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్లు ఉన్న ప్రతి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ తో కలిసి జిల్లాలోని తహసీల్దార్ల తో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా మండలాల వారీగా ఎస్ఐఆర్ కింద ఎన్ని ఎన్యూమరేషన్ ఫారాలు అందించారో ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఇప్పటిదాకా 70 శాతం పూర్తి అయిందని తెలిపారు. మిగతా పంపిణీ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్లు ఉన్న ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారం అందించాలని స్పష్టం చేశారు. బీ ఎల్ ఓ లు ఈ లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఓటర్ ఫారం నింపి దానితో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోను బీ ఎల్ ఓ లకు అందించాలని సూచించారు. ఫారాలు నింపడంలో సహాయం చేయాలని తెలిపారు. నింపిన ఫారాలు సరిచూసుకుని ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా పకడ్బందిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**అప్రమత్తంగా ఉండాలి**

వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలోని తహసీల్దార్లు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలు జలమయం అయినా, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న, పంటలు పాడైన, ఇండ్లు కూలిన, పశువులు చనిపోయిన, మనుషులు మృతిచెందిన ఆ వివరాలను తహసీల్దార్లు సేకరించి.. ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. చెరువులు, రిజర్వాయర్లు నిండి మత్తడి దూకే పరిస్థితుల్లో ప్రజలను అటు వైపు వెళ్లకుండా పోలీస్ వారితో సమన్వయం చేసుకుని బారికేడ్లు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న చోట ఆయా శాఖల అధికారులతో మరమ్మత్తు చేయించి.. రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని సూచించారు. త్వరితగతిన పరిష్కరించాలి భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# 'సర్'తో ప్రాణాలు హరీ?

## జాబితాలో పేరు లేదని..

## జైలుకు పంపుతారనే భయంతో ఆత్మహత్య చేసుకున్న కారు డ్రైవర్ ముజిబుర్



హైదరాబాద్, మనం ప్రతినిధి : హైదరాబాద్‌లో ఒక అత్యంత హృదయవిదారకమైన సంఘటన చోటుచేసుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల సవరణ కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ.. ఒక సామాన్యుడి ప్రాణం తీసింది. 'సర్' లిస్ట్‌లో తన పేరు లేకపోవడంతో, తనను జైలుకు పంపుతారనే భయంతో బోరబండ ఏరియాలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు అందించిన కథనం ప్రకారం... బోరబండ ప్రాంతంలోని భరత్ నగర్ నివాసి అయిన షేక్ ముజిబుర్ రహ్మాన్ (51) ఒక సాధారణ కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందులో ఇద్దరు పిల్లలు మానసిక వికలాంగులు. అయితే ముజిబుర్ పేరు పాస్ పోర్ట్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఐడెంటిటీ కార్డులలో తప్పుగా ఉండటంతో... వాటిని సరిచేసుకోవడానికి ఏజెంట్ల చుట్టూ తిరుగుతూ ఇప్పటికే భారీగా ఖర్చు చేసి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ప్రక్రియలో తన డాక్యుమెంట్లు సరిపోలడం లేదని, సర్ జాబితాలో తన పేరు లేదని ముజిబుర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. లిస్ట్‌లో పేరు లేకపోతే పోలీసులు వచ్చి తనను జైలుకు పంపుతారని... అదే జరిగితే తన ఇద్దరు దివ్యాంగ పిల్లలను, కుటుంబాన్ని ఎవరు చూసుకుంటారంటూ భార్య వద్ద నిత్యం ఆవేదన చెందేవాడు. భార్య ఎంత ధైర్యం చెప్పినా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాల వల్ల అతడిలో భయం పోలేదు?. దీంతో ఈ తీవ్ర మానసిక ఒత్తిడి భరించలేక ముజిబుర్ తన ఇంటి బయట ఉన్న షెడ్డు ఇనుప రాడ్కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిజంగానే 'సర్' భయంతోనే చనిపోయాడా? లేక ఇతర ఆర్థిక, ఆరోగ్య కారణాలు ఉన్నాయా? అనే కోణంలో సైతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వాణిజ్య వినియోగదారులకు ఊరట..


## పెట్రోల్, డీజిల్‌పై ఆంక్షలను ఎత్తివేసిన కేంద్రం

## జులై 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నట్లు ప్రకటన

## ఇంధన సరఫరాలు స్థిరపడటంతో ప్రభుత్వ నిర్ణయం

## వాణిజ్య, పారిశ్రామిక సంస్థలకు పెద్ద ఊరట

## పీఎన్జీ వాడకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టీకరణ



హైదరాబాద్, మనం ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు పెద్ద ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ రిటైల్ అమ్మకాలపై విధించిన తాత్కాలిక ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. జులై 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నట్లు సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో పారిశ్రామిక, సంస్థాగత, రవాణా రంగాలకు చెందిన సంస్థలు ఎలాంటి పరిమితులు లేకుండా నేరుగా రిటైల్ బంకుల నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు మార్గం సుగమమైంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి మీదుగా ఇంధన సరఫరాలకు అంతరాయం కలగవచ్చన్న ఆందోళనలతో, ఈ ఏడాది జూన్ 12న కేంద్రం ముందుజాగ్రత్త చర్యగా ఈ ఆంక్షలను విధించింది. దీనికి తోడు, బల్క్, రిటైల్ డీజిల్ ధరల మధ్య లీటర్కు సుమారు రూ.40 వ్యత్యాసం ఉండటంతో అనేక వాణిజ్య సంస్థలు రిటైల్ బంకుల వైపు మళ్లాయి. ఈ నేపథ్యంలో ఇంధన సరఫరాను కాపాడేందుకు వాణిజ్య సంస్థలు బంకుల నుంచి నేరుగా ఇంధనం కొనడాన్ని నిషేధించడంతో పాటు, డీజిల్ కొనుగోళ్లపై రోజుకు 200 లీటర్ల పరిమితి విధించారు. ప్రస్తుతం ఇంధన సరఫరాలు క్రమంగా స్థిరపడుతుండటంతో ప్రభుత్వం ఆంక్షలను దశలవారీగా సడలిస్తోంది. ఇటీవలే హోటళ్లు, రెస్టారెంట్లకు వాణిజ్య ఎల్పీజీ సరఫరాను కూడా సాధారణ స్థితికి పునరుద్ధరించింది. అయితే, ఇప్పటికే పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ)కి మారిన వినియోగదారులను తిరిగి ఎల్పీజీ వాడకానికి అనుమతించబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. పీఎన్జీ వినియోగాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని తేల్చిచెప్పింది.

# పద్మభూషనుడికి ఘన సత్కారం

## దత్తాత్రేయుడి ప్రయాణం యువ వైద్యులకు స్ఫూర్తిదాయకం'

## డా. నోరి దత్తాత్రేయుడిని సత్కరించిన మెడికవర్ యాజమాన్యం



హైదరాబాద్, జూన్ 29(మనం న్యూస్): దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మభూషణ్ అవార్డును అందుకున్న ప్రపంచ ప్రఖ్యాత భారతీయ-అమెరికన్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా. నోరి దత్తాత్రేయుడుని మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం సోమవారం ఘణంగా సత్కరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మెడికవర్ ఆంకాలజీ విభాగానికి చెందిన సీనియర్ వైద్యులు, నిపుణులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతికత, భారతదేశంలో ఆంకాలజీ రంగ భవిష్యత్, ప్రతి రోగికి నాణ్యమైన క్యాన్సర్ వైద్య సేవలుఅందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరంపై డా. నోరి వైద్య బృందంతో ప్రత్యేకంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మంటాడ గ్రామానికి చెందిన డా. నోరి దత్తాత్రేయుడు కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఉస్మానియా మెడికల్ కాలేజీలోఉన్నత విద్యను పూర్తి చేసి, అమెరికాలోని ప్రముఖ క్యాన్సర్ వైద్య సంస్థల్లో విశిష్ట సేవలు అందించారు. బ్రాకీథెరపీ చికిత్సలో ఆయన చేసిన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశను చూపించాయి. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అభివృద్ధిలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సెంటర్ హెడ్ డా. ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ, 'డా. నోరి దత్తాత్రేయుడు ప్రపంచ స్థాయి వైద్య విజ్ఞానాన్ని భారతదేశానికి తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి. క్యాన్సర్ వైద్య రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు పద్మభూషణ్ పురస్కారం అత్యంత సముచిత గౌరవం,ఆయన ప్రయాణం యువ వైద్యులకు స్ఫూర్తిదాయకం' అని ఆయన పేర్కొన్నారు.

**యువ వైద్యులకు ఆదర్శం:**

మెడికవర్ ఆంకాలజీ కన్సల్టెంట్ డా. రిగ్వేద్ నిట్టాల మాట్లాడుతూ, 'డా. నోరి వైద్య జీవితం ప్రతి ఆంకాలజిస్టుకు ఆదర్శమని,రోగి కేంద్రిత వైద్య సేవలు ఎలా ఉండాలో ఆయన చూపిన మార్గం యువ వైద్యులకు స్ఫూర్తినిస్తుందన్నారు. ఆయనతో జరిగిన చర్చ మా బృందానికి ఎంతో విలువైన అనుభవంగా నిలిచింది' అని తెలిపారు.ఆనంతరం డా. నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ, 'హైదరాబాద్ నాకు ఎప్పుడూ ప్రత్యేకమైన నగరమని,ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్స ప్రతి రోగికి అందుబాటులోకి రావాలన్నదే నా లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్య బృందం అందించిన ఈ గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు' అనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ ఆంకాలజీ విభాగానికి చెందిన డా. మాధాల రవికృష్ణ,లతో పాటు సీనియర్ కన్సల్టెంట్లు, వైద్యులు, నర్సింగ్,ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షం కురుస్తది

నదుల మీద
వాగులు పై
చిక్కని అడవులపై
కొండ వాలు తలంపైకి
ఎండకు ఎండి బాగా చెదిరిన
చెట్ల తలలపై
ఆకాశంలోకి ఎగబాకి
నిటారుగా నిలబడిన
పైన్ వృక్ష శిరస్సుపై
ఈజిప్ట్
నేలను తడుపుతున్న నైలు నది
తనువును తాకుతూ
అమెజాన్ గుండెల్లో
సింఫని లా
విక్టోరియా జలపాత హోరులో
తానో రాగమై
వర్షం కురుస్తది
సూడాన్ ఎద్దు కొమ్ములు కడుగుతూ
కాంగో అడవుల్లో
కలగంటున్న చింపాజి
దేహాన్ని తడపటానికి
వర్షం కురుస్తది
బ్రెజిల్ ఫవేలా కొండలపై
కరేబియన్ నీలి జలాల్లో
తనివి తీరా తడవటానికి
వర్షం కురుస్తది
చిర పుంజిలో
శివ తాండవం చేయడానికి
పుడమి పురి విప్పడానికి
మాయన్ ల
మిగిలిన మనుషుల ముందు
కలిసి ఆడటానికి
తప్పకుండా వర్షం కురుస్తది
లామాల మెడను ముద్దాడటానికి
మచు పీచు స్వర్గపు అంచులను
తాకటానికి
వర్షం కురుస్తది

- డా. సుంకర రమేశ్
9492180764

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి

- ఎడిటర్

# ‘డబుల్ ఇంజన్’లో ట్రబుల్స్ ఎక్కువ




దేశంలో ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే అవినీతి గురించి చర్చించడానికి, మాట్లాడటానికి ఇంతకంటే సరైన వారం మరొకటి ఉండదనిపిస్తోంది. వ్యక్తిగతంగా నా గురించి నేను చెప్పుకోవాల్సి వస్తే, ఇటీవల కాలంలో సమాజంలో, వార్తల్లో ‘అవినీతి’ అనే పదం ఇన్నిసార్లు వినాల్సి రావడం వల్ల నా తల తిరిగిపోతోందని నేను బహిరంగంగానే అంగీకరిస్తున్నాను. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలియజేస్తున్న ప్రతిపక్షాలను ఉద్దేశించి కొందరు అన్న ‘బొద్దింకలు’ అనే పదం నుండి.. అయోధ్య పవిత్ర రామాలయ నిర్మాణంలో బయట పడుతున్న రకరకాల వివాదాల వరకు.. అలాగే ఉజ్జయినిలో బంధుప్రీతితో కూడిన భూవ్యవహారాల అక్రమాల్లో దొరికిపోయిన ‘డబుల్ ఇంజన్’ ప్రభుత్వ ముఖ్యమంత్రి వరకు.. దేశంలో అవినీతి అనేది ఇప్పుడు ఎవరూ విస్మరించలేని అంతర్భాగంగా మారిపోయింది.

ఈసారి కూడా నేను వ్యాయామశాలలో ఉన్నప్పుడు, దేశ జాతీయ రాజకీయ రంగంలో అవినీతి అనేది అకస్మాత్తుగా ఇంతలా ఎలా పేలిందా అని తీవ్రమైన దిగులుతో, ఆందోళనతో ఆలోచిస్తున్నాను. సరిగ్గా అదే తరుణంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ టీవీ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో తాము అందిస్తున్న ‘డబుల్ ఇంజన్’ ప్రభుత్వం వల్లే ఆ రాష్ట్రం ఇప్పుడు దేశంలోనే నంబర్ వన్‌గా మారిందని ఆయన ఎంతో ఆత్మవిశ్వాసంతో, చిరునవ్వుతో ప్రకటించడం నన్ను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. కానీ వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే అది ఎంతమాత్రం నంబర్ వన్ కాలేదు.

యోగి ఆదిత్యనాథ్ చేసిన ఆ ప్రసంగంలో నన్ను ప్రధానంగా ఆకర్షించిన అంశం ఏమిటంటే, ఆయన తన 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం గురించి పదేపదే చేసిన ప్రస్తావన. ఎందుకంటే, ప్రస్తుతం దేశంలో అత్యంత ఆదర్శవంతమైనవిగా, పారదర్శక మైనవిగా ప్రచారం చేయబడుతున్న ఇటువంటి రాష్ట్రా ల నుంచే ఈ మధ్య కాలంలో అతిపెద్ద అవినీతి కథనాలు మరియు స్కాము లు వెలుగులోకి వస్తున్నాయి. ఉదాహరణకు అయోధ్యలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన రామాలయ నిర్మాణం నేరుగా ‘బుల్డోజర్ బాబా’ అని పిలవబడే యోగి ఆదిత్యనాథ్ ప్రత్యక్ష పర్యవేక్షణలోనే జరిగింది.

అలాంటప్పుడు, దేశవిదేశాల నుండి సామాన్య భక్తులు పూర్తి విశ్వాసంతో, భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించిన కానుకల నుండి బంగారం, వెండి, ఖరీదైన ఆభరణాలు మరియు కోట్ల రూపాయల నగదు లూటీ అవు తున్నాయనే చిన్నపాటి అనుమానం లేదా సమాచారం కూడా పాలకులకు రాకపోవడం నిజంగా అత్యంత అసాధారణమైన విషయం. ఆలయ నిధులను రక్షించాల్సిన ట్రస్టీలు కూడా అక్కడ అంత పెద్ద ఎత్తున ఏం జరుగుతుందో గమనించలేకపోవడం అంతే విచిత్రంగా ఉంది. ఆలయానికి వచ్చే కానుకలను, నిధులను వృత్తిపరమైన సంస్థల చేత లెక్కించాలని ఎప్పుడో నిపుణులు ఇచ్చిన సలహాను వారు




ఎందుకు పక్కన పెట్టారో ఇప్పుడు సమాజానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం దేశంలో వెలుగుచూస్తున్న ఇలాంటి అన్ని కేసుల్లో మనకు స్పష్టంగా కనిపిస్తున్నది ఒకటే.. అది పాలకులలో ఉన్న నేరపూరితమైన విషయాల పట్ల జవాబుదారీతనం లేకపోవడమే.

ఇక విద్యావ్యవస్థ విషయానికి వస్తే, గత వారం మరో యువ భారతీయ విద్యార్థి నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలను తట్టుకోలేక, మళ్లీ ఆ పరీక్షను ఎదుర్కొనే ధైర్యం లేక ఆత్మహత్య చేసుకుని బలయ్యాడు.

గత ఐదేళ్ల కాలంలో కేవలం ఈ నీట్ పరీక్ష గందరగోళం కారణంగా దేశవ్యాప్తంగా దాదాపు వంద మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు కోల్పోగా, గత ఏడాదిలోనే అత్యధికంగా మరణాలు సంభవిం చడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దేశంలోని పరీక్షల వ్యవస్థలో జరిగిన ఈ ఘోరమైన గందరగోళానికి, అవకతవకలకు కేంద్ర విద్యాశాఖ మంత్రిదే ప్రత్యక్ష బాధ్యత కాబట్టి ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం పూర్తిగా సమంజసమైనదే.

ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలనే ప్రధాన డిమాండ్‌తోనే ప్రతిపక్షాలు గత వారం అంతా జంతర్ మంతర్ వద్ద తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా నిరసనలు చేస్తూ గడిపారు. కానీ, శుక్రవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో విద్యాశాఖ మంత్రికి పోస్ట్ చేసిన ఆత్మీయ పుట్టినరోజు శుభాకాంక్షలను బట్టి చూస్తే, ఆయనను పదవి నుంచి తొలగించే లేదా ఆయన రాజీనామాను కోరే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోంది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ పౌరులుగా, మనకు సేవకులుగా ఉండాల్సిన ప్రజాప్రతినిధుల నుండి మరియు ప్రభుత్వం నుండి పూర్తి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే సంపూర్ణ హక్కు మనకు ఉంది. కానీ, తనను తాను నిరంతరం ‘ప్రధాన్ సేవక్’ (ప్రధాన సేవకుడు) అని పిలుచుకునే దేశ ప్రధాని, తన సొంత మంత్రులు మరియు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చూపిస్తున్న ఇటువంటి బాధ్యతారాహిత్యం వల్ల దేశ ప్రతిష్ట ఎంతగా దెబ్బతింటుందో గమనించలేకపోవడం విచారకరం.

ముంబైలో విధానసభ బడ్జెట్ సమావేశాలు జరుగు తున్నప్పుడు ప్రజాప్రతినిధులు, మంత్రులు సామాన్యులకు అందుబాటులో ఉండకుండా అత్యంత విలాసవంతమైన ఒబెరాయ్ హోటల్లో విడిది చేస్తారనే విషయం, దేశంలో అవినీతి ఇప్పుడు ఎంత బహిరంగంగా ప్రదర్శించబడుతుందో ప్రధాని నరేంద్ర మోడీగారికి తెలుసా? దీనికి అంతటికీ ఎవరు డబ్బులు చెల్లిస్తున్నారు, ఎందుకు చెల్లిస్తున్నారు? ఒకవేళ మీరు మర్చిపోయి ఉంటే ఇక్కడ గుర్తుచేస్తున్నాను.. ప్రస్తుతం మహా రాష్ట్రలో నడుస్తున్నది కూడా మరొక డబుల్ ఇంజన్ ప్రభుత్వమే.

ప్రస్తుత రోజుల్లో అవినీతిపరులైన రాజకీయ నాయకులు దేశంలో ఎంతగా పెరిగిపోయారంటే, ప్రధానమంత్రి మోదీ ఎప్పుడో అధికారంలోకి రాకముందు ఇచ్చిన 'నా ఖాంగా, నా ఖానే దూంగా' (నేను అవినీతికి పాల్పడను, ఇతరులను కూడా అవినీతి తిననివ్వను) అనే హామీని ఆయన నిలబెట్టుకుంటారని ప్రజలు ఆశించడం ఎప్పుడో మానేశారు. దాదాపు పన్నెండేళ్ల క్రితం కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడానికి అప్పట్లో జరిగిన అవినీతి స్కాములే ప్రధాన కారణం, అందుకే మోదీ ఇచ్చిన ఈ అవినీతి రహిత హామీ ఆనాడు ఎన్నికల్లో దేశ ప్రజలపై అంత శక్తివంతమైన ప్రభావాన్ని చూపించింది. ఆ ప్రభావం తదనంతర కాలంలో మసకబారినట్లు కనిపిస్తుంది. దేశంలో ఏదైనా కొత్త అవినీతి కథనం లేదా స్కామ్ బయట

పడినప్పుడు, దానిపై వివరణ ఇవ్వాల్సింది పోయి.. గతంలో కాంగ్రెస్ హయాం ఇంతకంటే ఘోరంగా ఉండేదని, అప్పట్లో ఇన్ని స్కాములు జరిగాయని బిజెపి అధికార ప్రతినిధులు ఎందుకు అంత వ్యంగ్యంగా, బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారు? ఒకవేళ మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి తనపై వచ్చిన ఆరోపణలకు గౌరవప్రదంగా రాజీనామా చేయాల్సి వస్తే, ఆస్తుల వివరాలు అత్యంత రహస్యంగా మరియు అనుమానాస్పదంగా ఉన్న కర్ణాటక ముఖ్యమంత్రి కూడా రాజీనామా చేయాలి కదా అని ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ ఎందుకు వాదిస్తున్నారు? వీటన్నిం టినీ గమనిస్తే ఒక నిజం స్పష్టమవుతోంది..

ప్రస్తుత సమాజంలో అతి త్వరగా, ఎలాంటి కష్టం లేకుండా అత్యంత సంపన్నులు కావడానికి రాజకీయాల్లోకి ప్రవేశించడం కంటే సులువైన మార్గం మరొకటి లేదు. దేశంలోని చాలా మంది పెద్ద రాజకీయ నాయ కులు తమ వృద్ధాప్యంలో కూడా అధికారాన్ని పట్టుకుని వదల కుండా ఉండటానికి మరియు తమ తర్వాత తమ పిల్లలు, వార సులు కూడా రాజకీయాల్లోకే వచ్చేలా చూసుకోవడానికి ప్రధాన కారణం, ఈ రంగంలో చాలా సులభంగా, కోట్లాది రూపాయల నల్లధనాన్ని సంపాదించ వచ్చనే పచ్చి నిజమే.


అయితే, ఈ విధమైన అవినీతి సంస్కృతి అనేది హిందుత్వ నాయకులు దేశ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి మాత్రమే కొత్తగా జరుగుతున్నది ఏమీ కాదు. కానీ నరేంద్ర మోదీ మొదటిసారి దేశ ప్రధానమంత్రి అయినప్పుడు, దశాబ్దాలుగా వస్తున్న ఈ అసహ్యకరమైన, కుళ్ళిపోయిన రాజకీయ సంస్క ృతిని ఆయన మారుస్తారని దేశంలోని సామాన్య ప్రజల్లో ఒక గొప్ప ఆశ కలిగింది. ఆ తరువాత నాయకులు అంతా నీతులు చెప్పేవారేనన్న తత్వం బోధపడింది.

కానీ ఆయన తన పదేళ్ల పాలనలో దీనిని మార్చలేకపోవడం అనేది ఆయన ప్రభుత్వ అతిపెద్ద వైఫ ల్యాలలో ఒకటిగా నిలిచిపోతుంది. ఉజ్జయినిలో జరిగిన అక్రమ భూవ్యవహారాలపై గత వారం ఈ పత్రికలో వచ్చిన పరిశోధనాత్మక కథనం లాంటి నిజాలను ధైర్యంగా బయటపెట్టడానికి ఈ రోజుల్లోని మెయిన్ స్ట్రీమ్ మీడియా కూడా పాలకులకు లొంగి పోయింది. చాలా కాలం తర్వాత జర్నలిజం విలువలను కాపా డుతూ వచ్చిన అద్భుతమైన పరిశోధనాత్మక కథనం అది.

- వెంక గారి భూమయ్య
9848559863

# మనిషి మారకపోతే మార్క్స్ ఏంచేస్తాడు..?

ఈ దేశంలో ఒక విచిత్రమైన అలవాటు ఉంది.సమాజంలో సమస్యలు కనిపించిన ప్పుడల్లా మనం పరిష్కారం కోసం ఒక మహాను భావుడిని వెతుకుతాం. ఒకరు బుద్ధుడిని తీసుకొస్తారు. మరొకరు అంబేద్కరును చూపి స్తారు. ఇంకొకరు మార్క్స్‌ను ముందుకు తెస్తారు. వారందరూ గొప్పవారే. వారి ఆలోచనలు మానవ చరిత్రను ప్రభావితం చేశాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం ఎప్పుడూ అడగబడదు. ‘బుద్ధుడు ఉన్నా డు. అంబేద్కర్ ఉన్నాడు.మార్క్స్ ఉన్నాడు. మరి మనం ఇంకా ఎందుకు మారలేదు‘?. ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా మరొక మహానుభావుడి కోసం ఎదురు చూడడం అనేది చీకట్లో పోగొట్టు కున్న తాళం చెవిని వెలుతురు ఉన్నచోట వెతకడం లాంటిది. మన దేశంలో సిద్ధాంతాల కొరత కాదు. ప్రపంచంలో మరేదేశానికి లేనంత సిద్ధాంత సంపద మనదగ్గర ఉంది. మతాలు ఉన్నాయి. తత్వాలు ఉన్నాయి. విప్లవ గ్రంథాలు ఉన్నాయి. రాజ్యాంగం ఉంది. ఉద్యమాల చరిత్ర ఉంది. అయినప్పటికీ అన్యాయం ఉంది. అసమానత ఉంది.ద్వేషం ఉంది. దోపిడీ ఉంది. కులం ఉంది. మత వివక్షకు కూడా ఉంది. అంటే సమస్య ఎక్కడో వేరేచోట ఉంది. మనిషి ఒక ఆశ్చర్యక రమైన జీవి. అతడు స్వేచ్ఛ గురించి మాట్లాడు తాడు. కానీ తనకు అవకాశం దొరికితే ఇతరులను నియంత్రిం చాలని చూస్తాడు. సమానత్వం గురించి ఉపన్యాసాలు ఇస్తాడు. కానీ తనకు ఉన్న ప్రత్యేక హక్కులను వదులుకోవడానికి సిద్ధపడడు. న్యాయం గురించి గట్టిగా మాట్లాడతాడు. కానీ



తనకు లాభం కలిగించే అన్యాయాన్ని మాత్రం మౌనంగా సమర్థిస్తాడు. ఇదే మానవ వైరుధ్యం.

బుద్ధుడు మనిషిలోని దుఃఖాన్ని చూశాడు అంబేద్కర్ కుల ఆధిపత్యాన్ని చూశాడు. మార్క్స్ ఆర్థిక దోపిడిని చూశాడు. కానీ ఈ ముగ్గురి ఆలో చనలు కూడా తమ స్వార్థానికి అనుగుణంగా మార్చుకునే మనిషి ‘మనస్తత్వాన్ని’(విప్లవం ఓడిపోయే చోటు) మనం ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేదు. అధ్యయనం చేసే ప్రయత్నమూ చేయడం లేదు. అందుకే చరిత్రలో ఒక విచి త్రమైన దృశ్యం కనిపిస్తుంది. విప్లవం కోసం పోరా డిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన తరువాత అధికార భాషనే మాట్లాడుతాడు. సమానత్వం కోసం పోరాడిన నాయకుడు తన అనుచరుల మధ్య అసమానతలను సహజంగా స్వీకరిస్తాడు. తన శత్రువును సులభంగా గుర్తిస్తాడు కానీ తనలోని అహంకారాన్ని గుర్తించలేడు. తనకు జరిగిన అన్యాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాడు కానీ తాను చేసిన అన్యాయాన్ని మరుసటిరోజే మర్చిపోతాడు. తనను అణిచివేసే వ్యవస్థను విమ ర్శిస్తాడు. కానీ తాను ఇంకొకరిపై చూపుతున్న ఆధి పత్యాన్ని చూడలేడు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమమే కొన్నిసార్లు తనలోనీ భిన్నాభిప్రాయాలను అణచి వేస్తుంది. అంటే సమస్య సిద్ధాంతంలో లేదు సమస్య సిద్ధాంతాన్ని ఉపయోగిస్తున్న మనసులో ఉంది. అందుకే సమాజ మార్పు గురించి మాట్లాడేటప్పుడు మనం కేవలం రాజకీయాలను, కులాన్ని, ఆర్థిక వ్యవస్థను మాత్రమే చర్చిస్తున్నాం. కానీ అన్నింటిని నడి పిస్తున్న మనస్తత్వాన్ని గురించి తక్కువగా మాటా డుతున్నాం. ప్రపంచ చరిత్రలో జరిగిన అనేక ఘర్షణలు కేవలం ఆర్థిక, మత కారణాల వల్ల మాత్రమే జరగలేదు. మనిషి తన గుర్తింపును కాపా డుకోవాలనే భయం,తన గుంపును గొప్పదిగా భావించాలనే కోరిక, ఇతరుల కంటే పై చేయిగా ఉండాలనే మనస్తత్వం కూడా వాటికి కారణమ య్యాయి. ఈ సత్యాన్ని గుర్తించకుండా కేవలం సిద్ధాంతాలను అమలు పరచడం ద్వారా సమా జాన్ని మార్చగలమని భావించడం ఒక భ్రమ. ఈ దేశంలో చాలామంది మహానుభావులను చదు వరు. వారిని పూజిస్తారు. ఆలోచనలను విశ్లేషిం చరు. వాటిని నినాదాలుగా మార్చుకుంటారు. ప్రశ్నించరు. విశ్వసిస్తారు. ఫలితంగా సిద్ధాంతం ఒక మతంగా మారుతుంది. నాయకుడు ఒక దేవుడిగా మారుతాడు. ఏ సిద్ధాంతమైన విమర్శ నాత్మక అధ్యయనం నుంచి ఆరాధన దశలోకి వెళ్ళినప్పుడు అది తన విముక్తి శక్తిని కోల్పో తుంది. తద్వారా ఆలోచన ఆగినచోట మార్పు కూడా ఆగిపోతుంది.

అందుకే ఈ దేశానికి కావలసింది మరో బుద్ధుడు కాదు. మరో అంబేద్కర్ కాదు. మరో మార్క్స్ కాదు. వారందరి నుండి నేర్చుకుంటూనే వారందరినీ ప్రశ్నించగలిగే ఒక కొత్త మేధో సంస్క ృతి. తన కులాన్ని, తన మతాన్ని, తన రాజకీయ నాయకుడిని,అవసరమైతే తనను తాను కూడా ప్రశ్నించగలిగే వ్యక్తి.

ఎందుకంటే రాజకీయ, ఆర్థిక,సామాజిక విప ్లవాలు అనేవి ప్రభుత్వాలను, సంపద పంపిణీని, సంబంధాలను మార్చవచ్చు నేమోగాని మనిషి తనను తాను ‘పరిశీలించడం’ ప్రారంభించిన రోజే అసలు విప్లవం మొదలవు తుంది.

- ఆయిరబోయిన బిక్షపతి
79932 48717

# చరిత్రను మలుపు తిప్పే మహాశక్తులు



చరిత్ర పుటలను తిరగేస్తే ప్రతి గొప్ప మార్పు వెనుక ఒక ప్రజా ఉద్యమం ఉన్నట్లు కనిపిస్తుంది. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామం నుండి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వరకు, నక్సల్బరీ నుండి నేటి ప్రజా స్వామ్య పరిరక్షణ పోరాటాల వరకు, ప్రతి సంద ర్భంలోనూ ప్రజల సంఘటిత శక్తి వ్యవస్థల పునా దులను కదిలించింది. ఒక విప్లవ ప్రస్థానంలో ప్రజాఉద్యమాలు అనేవి కేవలం గొంతుకలు మాత్రమే కాదు, అవి సమాజంలోని అన్యాయా లను ఎదిరించే చారిత్రక ఆయుధాలు.

చాలామంది ప్రజా ఉద్యమాలను కేవలం రోడ్ల మీద చేసే ఆందోళనలుగా, ట్రాఫిక్ జామ్లుగా చూస్తుంటారు. కానీ, వాస్తవానికి ఉద్యమం అంటే సమాజంలో ఉన్న ఒక లోపాన్ని గుర్తించి, దానిపై చర్చను లేవనెత్తి, పాలకవర్గాలను జవాబుదారీని చేయడం. ఇది ప్రజల చైతన్యాన్ని పెంచుతుంది. ఒక వ్యక్తి తన సమస్య కేవలం తనది మాత్రమే కాదు, అది ఒక సామాజిక సమస్య అని గ్రహించిన క్షణమే ఉద్యమం మొదలవుతుంది. ఎన్నికల ద్వారా వచ్చిన ప్రభుత్వం ఏమైనా చేయవచ్చని భావించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. పాల కుల అహంకారానికి, అప్రజాస్వామిక చట్టాలకు బ్రేక్ వేసే శక్తి ఒక్క ప్రజా ఉద్యమాలకే ఉంటుంది. పౌర హక్కులు, కార్మిక చట్టాలు, విద్యా హక్కులన్నీ ప్రభుత్వాలు దానంతట అవి ఇచ్చినవి కావు, ప్రజా ఉద్యమాల ఒత్తిడి వల్ల సామాన్యుడు సాధించు కున్న హక్కులు. అందుకే, ఉద్యమాలు లేని ప్రజాస్వామ్యం, ఊపిరి లేని శరీరం వంటిది.

ప్రజా ఉద్యమాలలో విజయం ఎప్పుడు వస్తుందంటే, అక్కడ విశాల ఐక్యత ఏర్పడిన పుడు. వర్గం, కులం, మతం, ప్రాంతాల కంచె లను దాటి సామాన్య ప్రజలందరూ ఒకే వేదికపైకి వచ్చినప్పుడు పాలకుల గుండెల్లో రైళ్లు పరిగె డతాయి. నేడు లిబరేషన్ వంటి శక్తులు చేస్తున్న ప్రయత్నం అదే, కార్మికులను, రైతులను, దళితు లను, మేధావులను, మహిళలను మరియు యువ తను ఒకే ప్రజాస్వామ్య గొడుగు కిందకు తేవడం. ఈ ఐక్యత మాత్రమే ఫాసిజం వంటి పెను సవాళ్లను ఎదుర్కోగలదు. నక్సల్బరీ తిరుగుబాటు మనకు నేర్పిన పాఠం ఎంతటి శక్తివంతమైన వ్యవస్థనైనా, ప్రజలు తమ హక్కుల కోసం నిలబడితే వణకక తప్పదు. నేడు మన ముందున్న సవాళ్లు వేరు కా వచ్చు, కానీ పోరాడే మార్గం అదే. మతోన్మాదం, కార్పొరేట్ దోపిడీ, నిరుద్యోగం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి మనం నిరంతర ప్రజా ఉద్యమా లను నిర్మించాలి. ఏదో ఒక రోజు మార్పు వస్తుం దని వేచి చూడటం కంటే, ఆ మార్పులో భాగస్వా ములు కావడం గొప్ప విషయం. చరిత్రను చద వడం కాదు, చరిత్రను నిర్మించడం యువత కర్త వ్యం. ఆ నిర్మించే ప్రక్రియే ఈ ప్రజా ఉద్యమాలు. మీరు ఇల్లు వదిలి బయటకు రావచ్చు, సోషల్ మీడియాలో గళమెత్తవచ్చు, లేదా క్షేత్రస్థాయిలో సమస్యలపై చర్చించవచ్చు, ప్రతి చిన్న అడుగు ఒక ఉద్యమానికి పునాది. మన గమ్యం ఒక్కటే.. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన నవ భారతం. ఆ గమ్యం వైపు సాగే ప్రతి అడుగులో మనం సంఘటితమై ఉందాం.

- మామిండ్ల రమేష్ రాజా
7893230218

# ప్రజాస్వామ్య పరిరక్షణ.. సవాళ్లు

ప్రపంచ రాజకీయ చరిత్రలో ప్రజాస్వామ్యం అత్యంత విలువైన వ్యవస్థగా పరిగణించ బడుతోంది. ప్రజల ప్రాతినిధ్యంతో నిర్మితమయ్యే పాలన, వారి గొంతుకను వినిపించే వేదికగా పార్లమెంటులు రూపు దిద్దుకున్నాయి. ప్రజాస్వామ్య మూలాల పరిరక్షణ, పారదర్శక పాలన, బాధ్యతా యుతమైన వ్యవస్థ కోసం ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న పార్లమెంటరీ విధానం ఓ సుదీర్ఘ ఆచార సంప్రదాయంగా రూపాంతరం చెందింది. ఈ వ్యవస్థకు గల ప్రాధాన్యతను గుర్తించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 30న అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ఈ సందర్భంగా పార్లమెంటుల ప్రాముఖ్యత, వాటి పాత్ర, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చలు, సమీక్షలు జరుగుతాయి.

ఈ దినోత్సవానికి మూలాలుగా 1889లో స్థాపించబడిన ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ నిలిచింది. ప్రపంచం లోని వివిధ దేశాల శాసన సభల మధ్య సంబంధాలను మెరుగు పరచడానికి, చర్చా సంస్క ృతిని ప్రోత్సహించేందుకు, ప్రజాస్వామ్య విలువలను వ్యాప్తి చేయడానికే ఈ సంఘం ఏర్పడింది. జెనీవాలో స్థాపితమైన ఈ యూనియన్ ప్రారంభంలో మిగతా దేశాల దృష్టిలో ఓ భావ పూర్వక ప్రయత్నంలా కనిపించినా, కాలక్రమేణా ఇది ఓ ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగింది. 2018లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఈ తేదీకి అధికారిక గుర్తింపు ఇస్తూ జూన్ 30ను అంతర్జాతీయ పార్లమెంటరీ దినంగా ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా పార్లమెంటరీ వ్యవస్థల పాత్రకు, వాటి ప్రజాస్వామ్య బలోపేతానికి జరుగుతున్న కృషికి గౌరవం దక్కింది. పార్లమెంట్లు ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధులుగా నిలిచే ప్రధాన వేదికలు. చట్టాలు రూపొందించడం, పాలకులను సమీక్షించడం, నిధుల వినియోగంపై పర్యవేక్షణ చేయడం వంటి కీలకమైన విధులను నిర్వర్తిస్తూ, పాలనా యంత్రాంగాన్ని ప్రజల పక్షాన నియంత్రించే సాధనంగా పార్లమెంటు వ్యవస్థ ఉంటుంది. ప్రతి దేశంలోనూ రాజకీయ భిన్నాభిప్రాయాలకు చోటిచ్చే ఒకే ఒక్క వేదికగా పార్లమెంటు వ్యవస్థ పనిచేస్తుంది. అందుకే ఇది ప్రజాస్వామ్యానికి ప్రాణ వాయువుగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాల్లో రెండు సభల వ్యవస్థ అమలులో ఉంది. ఉదాహరణకు భారత దేశంలో లోకసభ, రాజ్య సభలు సమిష్టిగా పార్లమెంటు వ్యవస్థగా పనిచేస్తాయి. అమెరికాలో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్ అనే రెండు సభలు ఉన్నాయి. మరోవైపు నార్వే, బాంగ్లాదేశ్ వంటి కొన్ని దేశాల్లో ఒకే సభతో కూడిన పార్లమెంటు వ్యవస్థ (యూని క్యామెరల్) అమలులో ఉంది. ఏ రూపంలో ఉన్నా, పార్లమెంటు వ్యవస్థలు ప్రజల గళంగా మారి, వారి హక్కులను, అవసరాలను, సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే వేదికలుగా పనిచేస్తున్నాయి. భారత దేశంలో పార్లమెంటు మూడు భాగాలతో నిర్మితమైంది - రాష్ట్రపతి, లోకసభ, రాజ్యసభ. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత దేశానికి ఉన్న గుర్తింపు ఈ పార్లమెంటు వ్యవస్థ వల్లే సాధ్యమైంది. నిత్యం నూతన చట్టాల రూపకల్పన, బడ్జెట్ ఆమోదం, పాలకులు చేపడుతున్న విధానాల సమీక్ష - ఇవన్నీ పార్లమెంటు వేదికల పైనే జరుగు తున్నాయి. పార్లమెంటరీ చర్చలు, ప్రశ్నోత్తరాల ద్వారా ప్రజల గోడులను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం జరుగుతోంది. ఈ సందర్భంలో పార్లమెంటుల బాధ్యత మరింత పెరుగుతోంది. నేటి వేగవంతమైన ప్రపంచంలో వాతావరణ మార్పులు, ఆర్థిక అసమానతలు, వలసల సమస్యలు, సాంకేతిక విప్లవం, సామాజిక విభేదాలు వంటి ఎన్నో సవాళ్లు దేశాలను ఎదుర్కొంటున్నాయి. ఈ సవాళ్లకు సమగ్రంగా స్పందించగల సామర్థ్యం ఉన్న ఏకైక ప్రజాస్వామ్య వేదిక పార్లమెంటే. ప్రజల అవసరాలను నేరుగా ప్రతిబింబించే శక్తి ఉన్న సంస్థ ఇది. చర్చ, సంప్రదింపుల ద్వారా సామరస్యాన్ని, శాసన ప్రక్రియల ద్వారా అభివృద్ధిని, పాలనా సమీక్షల ద్వారా సమర్థతను సాధించగల శక్తి పార్లమెంటులో దాగి ఉంది. ఇప్పటి పరిస్థితుల్లో పార్లమెంటు వ్యవస్థలను మరింత పారదర్శకంగా, సమర్థ వంతంగా తీర్చిదిద్దడం అత్యవసరం. ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచే విధంగా సంస్కరణలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. సమాచార హక్కు, డిజిటల్ పార్లమెంటు, ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ప్రజలకు పార్లమెంటు పనితీరును నేరుగా చూపించడం వంటివి సరికొత్త మార్గాలు. యువత, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య స్వరూపానికి మరింత విశాలత ఇవ్వవచ్చు. రాజకీయాల్లో పారదర్శకత, నైతికత, ప్రజాభిముఖత పెరగాలంటే పార్లమెంటు వ్యవస్థలు బాధ్యతాయుతంగా నడవాల్సిన అవసరం ఉంది. జూన్ 30ను పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంట్లు ఆత్మ విమర్శ చేసుకోవాలి. అవి నిజంగా ప్రజల మద్దతుతో పని చేస్తున్నాయా? వాటిలో ప్రజల గొంతుకలు వినిపిస్తున్నాయా? ప్రజాస్వామ్య విలువలు




ప్రతిఫలిస్తున్నాయా? అనే ప్రశ్నల సమాధానాల కోసం కార్యాచరణలు రూపొందించాలి. ఈ దినోత్సవం కేవలం ఉత్సవంగా కాక, ప్రజాస్వామ్య పునరాలోచనకు అవకాశంగా మారాలి. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ కేవలం ఓటుతో ముగియ కూడదు. వారిని పట్టించుకునే స్థాయికి ప్రజల భాగస్వామ్యం చేరాలి. పార్లమెంటు వ్యవస్థలు ప్రజల హక్కుల పరిరక్షణకు గట్టి కవచాలు కావాలి. ప్రతీ పౌరుడి గొంతుక, ఆశయం, అభిప్రాయానికి అర్థవంతమైన ప్రాతినిధ్యాన్ని కల్పించడమే పార్లమెంటరీ వ్యవస్థల అసలైన లక్ష్యం. జూన్ 30 - అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవం మనకు ఈ మార్గాన్ని గుర్తుచేస్తూ, దానిపై నడవాల్సిన కర్తవ్యం ఒప్పించే సందేశ దినంగా నిలుస్తోంది.

జూన్ 30...అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవం

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, జూన్ 29 (మనం ప్రతినిధి): అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్జెండర్స్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్జెండర్స్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

అనంతరం విద్యార్థులతో కలిసి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి, నషా ముక్త్ భారత్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని, డ్రగ్స్కు అలవాటు పడిన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. అందువల్ల ప్రతి యువకుడు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించాలని మంత్రి సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాంటి వారు సంకోచించకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకుని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని పేర్కొంటూ, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి యువకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖకు తెలియజేసి సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ వంటి అవగాహన కార్యక్రమాలు యువతలో చైతన్యం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. యువత దేశానికి విలువైన ఆస్తి అని, వారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితులు, వారి ప్రవర్తన, అలవాట్లపై నిరంతరం దృష్టి ఉంచి వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు 'నో' చెప్పి, ఇతరులను కూడా చైతన్యవంతులను చేయాలని, సమాజంలో మత్తు రహిత వాతావరణం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువత, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల దుష్పరిణామాలను తెలుసుకుని వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు.

డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా ఉంచి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ డ్రగ్స్కు సంబంధించిన సమాచారం అందిస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాలపై సమాచారాన్ని గోప్యంగా అందించిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని పేర్కొంటూ, మత్తు రహిత జగిత్యాల మత్తు రహిత తెలంగాణ లక్ష్య సాధనకు ప్రతి పౌరుడు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీసీలు పాలితులుగా కాదు పాలకులుగా ఎదగండి

- జిల్లాలో బీసీ భవనం కోసం కృషి
- బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష



పెద్దపల్లి,జూన్ 29 (మనం ప్రతినిధి): దశాబ్దాల రాజకీయ బానిసత్వానికి చరమగీతం పాడి,బీసీలు బానిసలుగా కాకుండా బాదుషాలుగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్లో బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్దాల రాజకీయ బానిసత్వానికి చరమగీతం పాడాలని బీసీ సమాజానికి పిలుపునిచ్చారు.రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉండి,136 కులాల మద్దతు కలిగిన బీసీలు బలహీన వర్గాలు కాదని,వారు ఈ సమాజానికి వెన్నెముక వంటి బలమైన శక్తి అని చెప్పారు.రాబోయే 2028 ఎన్నికలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో 60 మంది బీసీ అభ్యర్థులను గెలిపించుకుని అసెంబ్లీకి పంపడమే బీసీ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.ఓటు అనే పదునైన ఆయుధాన్ని ఉపయోగించి అగ్రకులాల ఆధిపత్యాన్ని ఓడించాలని,తద్వారా రాష్ట్ర పాలనలో బీసీల ముద్ర ఉండాలని పిలుపునిచ్చారు. బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హామీలిచ్చిన రాజకీయ పార్టీలు ఆ మాట నిలబెట్టుకోలేదని, కేవలం ఓట్ల కోసమే బీసీలను వాడుకుంటున్నాయని మండిపడ్డారు.బీసీలు పాలితులుగా మిగిలిపోవద్దని, పాలకులై తెలంగాణను శాసించాలని శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు సమావేశంలో ఉన్న బీసీ ప్రతినిధులలో సరికొత్త ఉత్తేజాన్ని, పోరాట పటిమను నింపాయి. ఇకనుండి అగ్రకులాలకు ఓటు వేయడాన్ని నిరాకరించాలని,కులాల వారీగా చీలిపోకుండా,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలతో కలిసి బీసీలు ఐక్యంగా పోరాడితేనే సర్దార్ సర్వాయి పాపన్న ఆశించిన సమసమాజం సాధ్యమవుతుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో ఉన్న వివిధ కుల సంఘాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు,బీసీల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక బీసీ భవనం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష స్పష్టం చేశారు. స్థానికంగా నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె ఈ మేరకు కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ జిల్లాలో బీసీ భవన నిర్మాణ ఆవశ్యకతపై ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర మంత్రులతో చర్చిస్తామని,ఈ భవన నిర్మాణానికి గట్టి ప్రయత్నం చేస్తామని ఆమె పేర్కొన్నారు.రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నామని, అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికలలో తమ బలాన్ని నిరూపించుకుంటామని ఉష ధీమా వ్యక్తం చేశారు.భవిష్యత్తులో గ్రామ మరియు వార్డు స్థాయి వరకు బలమైన కమిటీలను ఏర్పాటు చేసి,బీసీ వాదాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా ఉద్యమిస్తామని ఆమె పిలుపునిచ్చారు.ఈ ఆత్మీయ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం పెద్దల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్,బీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్,బీసీ విద్యార్థి జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్,మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, మాజీ ఫిషరీస్ చైర్మన్ చేతి ధర్మయ్య, బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండ సతీష్, మహిళా కన్వీనర్ సిరవేణి స్వప్న,జిల్లా మహిళా అధ్యక్షురాలు మండే లక్ష్మి, నాగమణి,జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లక్ష్మణ్,సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు ఆసరి రాజయ్య,పెద్దపల్లి మండల అధ్యక్షుడు కలవేన రవి,ధర్మారం అధ్యక్షుడు చాగంటి కొండయ్య తోపాటు రమేష్, లక్ష్మణ్, బుగ్గ రామస్వామి,కాల్వ రమేష్, పోల్దాసరి సాయికుమార్, ఎదానందం,అబ్దుల్ మాలిక్, రవీందర్,బీరం రవి, అశోక్, రమేష్, కన్నం శ్రావణ్, అరవింద్,తదితర నాయకులకు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన నగరమేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ జూన్ 29((మనం న్యూస్): కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని 35వ డివిజన్ పరిధిలోని కాపువాడ, వెంకటసాయి థియేటర్ వెనుక ప్రాంతంలో రూ. 51 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, 35వ డివిజన్లో మున్సిపల్ సాధారణ నిధులతో రూ.51 లక్షల విలువైన అభివృద్ధి పనులు, అలాగే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నగరంలోని ప్రతి డివిజన్లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి వంటి సౌకర్యాలను దశలవారీగా అందిస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు



పర్యవేక్షించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజాధనంలోని ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడే విధంగా పారదర్శకంగా ఖర్చు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో కాపువాడ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, వర్షాకాలంలో బురద, నీరు నిల్వ ఉండే సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని మేయర్ కోరారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, 35వ డివిజన్ కార్పొరేటర్ సాదవేని సుజాత శ్రీనివాస్, కార్పొరేటర్ తోట అనిల్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా



కరీంనగర్ జూన్ 29(మనం బ్యూరో): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం శాఖల వారీగా ఆన్లైన్లో పర్యవేక్షిస్తున్నామని, దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 225 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ వారిగా ఆన్లైన్లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామని చెప్పారు.

ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ కు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- జూలై 1న కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలి
- సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



పెద్దపల్లి జూన్ 29 (మనం ప్రతినిధి): అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ పెద్దపల్లి మండల సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోనీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని పేదలకు ఇండ్లు మంజూరు చేస్తామని చెబుతూనే మరోవైపు వరంగల్లో ఇండ్లులేని పేదల గుడిసెలు వేసుకుంటే కాంగ్రెస్ వాటిని తొలగించడం దుర్మార్గమైన చర్య అని దీనిపైన రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో జూలై 1న కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని జిల్లాలోని ప్రజలందరూ కలెక్టరేట్ ముట్టడికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇరాన్ అమెరికా యుద్ధాన్ని ఆపలేని అసమర్థత ప్రధాని మోదీ అని, ప్రధాని మోది ట్రంప్ కు భయపడుతున్నారని, తెలంగాణ రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, కొందరు బిజెపి నాయకులు బెంగాల్ తరహా లోనే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడతామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమని, తెలంగాణలో ఒక్క ఓటు కూడా పోకుండా ఎస్ఐఆర్ నిర్వహించాలని అధికారులను డిమాండ్ చేశారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వంపై మతోన్మాదానికి వ్యతిరేకంగా సిపిఐ పార్టీ వామపక్షాలు కలిసి పోరాటం చేస్తాయని ఆయన తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై పెద్దపెల్లి మండల అధ్యక్షులు రమేష్ వినతి పత్రం అందించగా త్వరలోనే ఈ విషయమై మంత్రులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్ సిపిఐ కార్పొరేటర్ మార్కాపూర్ సూర్య, పెద్దపల్లి మండల పట్టణ కార్యదర్శులు రమేష్, నవీన్, కల్లేపల్లి రవి, జింక విటల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బాలసాని లెనిన్, జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల క్రితం తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



- జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి

పెద్దపల్లి, జూన్ 29 (మనం ప్రతినిధి): అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన షమీమ్ సుల్తాన తనకు ఇంటి స్థలం కరీంనగర్ లో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు కరీంనగర్లో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ పరిశీలించాలని డిఆర్ఓ తెలిపారు. రామగుండం జై భీమ్ నగర్ కు చెందిన గూపాల స్వామి తాను పక్షవాతంతో బాధపడుతున్నానని తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని ఎంబీఏ చదువు పూర్తి చేశానని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

ధర్మారం మండలం మేడారం గ్రామానికి చెందిన సాన కొమురయ్య అంగన్వాడి టీచర్ గా పని చేస్తున్న కుటుంబం నుంచి అక్రమంగా దివ్యాంగుల పెన్షన్, వితంతు పెన్షన్ పొందుతున్న వారిపై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ స్టడీ సర్కిల్ను సద్వినియోగం చేసుకోవాలి



- కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ జూన్ 29(మనం బ్యూరో): పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఎస్సీ స్టడీ సర్కిల్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. సివిల్స్- 2027కి సన్నద్ధమయ్యే ఎస్సీ అభ్యర్థులకు టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ద్వారా శిక్షణ అందించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే శిక్షణ కరపత్రాలను కలెక్టర్.. ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. తమ కుటుంబ వార్షికాదాయం రూ.మూడు లక్షలు ఉన్న ఎస్సీ అభ్యర్థులు శిక్షణ కోసం వచ్చే నెల 12వ తేదీలోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి జులై 17న ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజన వసతి కల్పించి స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డిప్యూటీ డైరెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఆదర్శం


- రైతులకు అందుబాటులో పెట్రోల్ పంపులు
- రైతుల సౌకర్యార్థం త్వరలో గోదాముల నిర్మాణం
- త్వరలో భారీ గోదాముల నిర్మాణం
- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు



సుల్తానాబాద్, జూన్ 29 (మనం న్యూస్): రైతుల సౌకర్యార్థం సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు, గోదాముల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు తెలిపారు. సహకార వారోత్సవాల సందర్భంగా సుల్తానాబాద్ మండలం నీరుకుల గ్రామంలో నూతనంగా నిర్మించిన కన్స్యూమర్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్-డీజిల్ బంక్)ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సుమారు రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముందు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని 14 సహకార సంఘాల్లో 11 సంఘాలను ఏకం చేసి ఎలిగేడు మండలం శివారులో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. సుల్తానాబాద్ సొసైటీని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విత్తన శుద్ధి కేంద్రంగా ఎంపిక చేశామని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7 వేల మెట్రిక్ టన్నుల గోదాములు మాత్రమే నిర్మించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల గోదాముల పనులు ప్రారంభించి, మరో 14 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోందన్నారు. రాబోయే రెండేళ్లలో నియోజకవర్గంలో లక్ష మెట్రిక్ టన్నులకు పైగా గోదాముల నిర్మాణానికి కృషి చేస్తామని వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం గర్రెపల్లి-భూపతిపూర్ ప్రాంతంలో మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామని, మహిళా సంఘాలకు గతంలో ఉన్న ప్రాధాన్యతను తిరిగి కల్పిస్తున్నామని పేర్కొన్నారు.నీరుకుల, కోమండ్లపల్లి, రంగంపల్లి, వేగురుపల్లి గ్రామాల ప్రజలకు ఈ పెట్రోల్ బంక్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. గర్రెపల్లి నుంచి పెగడపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే నీరుకుల గ్రామానికి రెండు నెలల్లో మానేరు తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని, గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన బస్సు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, డీసీఓ శ్రీమాల, సీఈవో బూర్గు సంతోష్ కుమార్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.211


# ఆపదలో ముగ్గురికి రక్తదానంతో ఆసరా

కరీంనగర్ జూన్ 29(మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ (ఆపదలో సహాయానికి రా) ఆధ్వర్యంలో వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న ముగ్గురికి రక్తం అవసరం కాగా ఆదుకున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ తెలిపారు. స్థానిక అపోలో రీచ్ ఆసుపత్రిలో గుండెకు ఆపరేషన్ నిమిత్తం చికిత్స పొందుతున్న కోరుట్ల మండలానికి చెందిన వ్యక్తికి అత్యవసర పరిస్థితిలో అరుదైన 'ఓ' నెగటివ్ రక్తం అవసరం కాగా సంస్థ సభ్యులు ఎ.పున్నం చందర్ 20వ సారి, ఇదే మండలానికి చెందిన వ్యక్తి గుండెకు ఆపరేషన్ నిమిత్తం వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 'ఎ ' పాజిటివ్ రక్తం అవసరం కాగా పి. రిత్విక్ రెడ్డి , మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన మహిళకు రెండవసారి రక్తం అవసరమవగా వి. జస్వంత్ రెడ్డి రక్తదానంతో ఆదుకున్నారు. ఈ సందర్భంగా ప్రాణదాతలుగా నిలిచిన రక్తదాతలను ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్.గోపి కృష్ణ, కె. ప్రవీణ్, జి. తిరుపతి, ఎం రవిచందర్, ఎస్. నిఖిల్, వి. అద్వైత్ తదితరులు అభినందించారు.



# ప్రజావాణికి చేరిన 'శ్రీ చైతన్య' పంచాయతీ పన్నుల ఎగవేత వ్యవహారం

- 15 ఏళ్లుగా పంచాయతీ పన్నులు ఎగ్గొట్టిన కార్పొరేట్ స్కూ కలెక్టర్కు ఫిర్యాదు
- స్కూల్ నుంచి పన్నులు వసూలు చేయకపోతే మేమూ పంచాయతీ పన్నులు చెల్లించం
- భిక్నూర్ రైతుల హెచ్చరిక
- సాక్ష్యాధారాలతో ప్రజావాణిలో ఫిర్యాదు.. తక్షణ విచారణకు కలెక్టర్ ఆదేశాలు



కామారెడ్డి, జూన్ 29 ( మనం న్యూస్ ): భిక్నూర్ పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ పంచాయతీ పన్నుల ఎగవేత వ్యవహారం జిల్లా స్థాయిలో సంచలనంగా మారింది. ప్రభుత్వ భూమిని సంవత్సరాలుగా వాణిజ్య అవసరాలకు వినియోగించుకుంటూ గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులు, ఇతర రుసుములు చెల్లించకుండా భారీగా ఆదాయ నష్టం కలిగించిందని ఆరోపిస్తూ సామాజిక కార్యకర్త బత్తుల భిక్షపతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్కు సాక్ష్యాధారాలతో కూడిన ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తూ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో చాలా కాలంగా వివాదాస్పదంగా కొనసాగుతున్న ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది.

**15 ఏళ్లుగా పన్నులు చెల్లించలేదనే ఆరోపణ**

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, భిక్నూర్ వారాంతపు సంతలో చిన్న వ్యాపారులు, రైతులు గంపకు రూ.20 చొప్పున పన్ను చెల్లిస్తుండగా, ఆ ఆదాయం ద్వారా గ్రామ పంచాయతీకి ప్రతి ఏడాది రూ.8 నుంచి రూ.10 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఇదే ప్రాంగణాన్ని సంవత్సరంలో 200 రోజులకు పైగా విద్యాసంస్థ వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నప్పటికీ, గత 15 సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా పంచాయతీ పన్ను చెల్లించలేదని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ కారణంగా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయ నష్టం వాటిల్లిందని, ఆ నిధులు గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించే అవకాశాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు.

**పేద రైతులకు ఒక న్యాయం... కార్పొరేట్ సంస్థలకు మరో న్యాయమా..?**

భిక్నూర్ ప్రాంత రైతులు ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక రైతు లేదా సామాన్యుడు ఇంటి పన్ను, దుకాణం పన్ను, ఇతర స్థానిక పన్నులు కొన్ని నెలలు ఆలస్యమైనా అధికారులు నోటీసులు జారీ చేసి కఠినంగా వసూలు చేస్తున్నారని, అదే సమయంలో లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసే కార్పొరేట్ విద్యాసంస్థల విషయంలో మాత్రం అధికారులు మౌనం పాటించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు.


**'పేదవాడి గంపకు ఒక రూలు...**

ఈ వ్యవహారంపై భిక్నూర్ రైతులు బహిరంగ హెచ్చరిక చేశారు. లక్షల రూపాయల పన్నులు బకాయి ఉన్న స్కూల్ యాజమాన్యం నుంచి అధికారులు వెంటనే బకాయిలు వసూలు చేయకపోతే గ్రామంలోని రైతులు, ప్రజలు కూడా ఇకపై పంచాయతీ పన్నులు చెల్లించబోమని స్పష్టం చేశారు. కార్పొరేట్ సంస్థలకు ప్రత్యేక రాయితీలు, సామాన్యులకు కఠిన చట్టాలు అమలు చేయడం సరికాదని పేర్కొంటూ గ్రామ ప్రజలందరికీ ఒకే చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు నిజంగానే పన్నుల బంద్కు దిగితే గ్రామ పంచాయతీ ఆదాయం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇతర అక్రమాలపై కూడా ఫిర్యాదు పంచాయతీ పన్నుల ఎగవేతతో పాటు పాఠశాలలో మరికొన్ని నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు 500 మంది విద్యార్థులకు కేవలం ఐదు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం వల్ల విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహించడం, పాఠశాల ప్రాంగణంలోనే పుస్తకాల విక్రయం జరపడం వంటి అంశాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాలపై విద్యాశాఖ అధికారులు కూడా సమగ్ర విచారణ జరపాలని భిక్షపతి కోరారు.

**అధికారులు స్పందించకపోతే న్యాయ పోరాటం**

ఈ వ్యవహారంలో అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై కాలయాపన చేస్తే బాధ్యులపై గౌరవ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పీఐఎల్) దాఖలు చేయడంతో పాటు లోకాయుక్తను కూడా ఆశ్రయిస్తామని భిక్షపతి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ తక్షణ విచారణకు ఆదేశాలు ఇవ్వడంతో ఇప్పుడు సంబంధిత శాఖలు ఎంత వేగంగా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. భిక్నూర్ గ్రామ పంచాయతీకి రావాల్సిన పన్నులను అధికారులు నిజంగా వసూలు చేస్తారా? లేక ఈ వ్యవహారం కూడా గతంలోలాగే ఫైళ్లకే పరిమితమవుతుందా? అనే చర్చ ప్రస్తుతం స్థానికంగా సాగుతోంది.

# దేశానికి వెన్నెముక రైతు



- ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి
- ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలిపట్టి దుక్కి దున్నిన మంత్రి పొన్నం

సిద్దిపేట జూన్ 29 మనం ప్రతినిధి: దేశానికి వెన్నెముకైన రైతు కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే పరిస్థితులు ఉన్నందున రైతులు తగిన సాగు మేలుకువలు పాటించాలని సూచించారు. కోహెడ మండలం కూరెల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ నాగలి పట్టి దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు కష్టపడి సాగు చేస్తున్న పంటలు సమృద్ధిగా పండాలని భూమాతను కోరుకున్నట్లు చెప్పారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆయురారోగ్యాలతో ఉంటేనే మిగతా అన్ని వర్గాలు సంతోషంగా ఉంటాయన్నారు. ఈసారి ఎల్ నినో ప్రభావం ఉన్నందున వర్షాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు ఆరుతడి పంటల సాగు పై దృష్టి పెట్టాలన్నారు. అధిక దిగుబడులు వచ్చే పంటలు ఎంచుకొని మంచి దిగుబడులు సాధించాలని కోరారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతుకు అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# తులం బంగారం హామీ ఏమైంది...?

**మహిళలకు రూ.2500 ఇంకా ఎప్పుడు ఇస్తారు**

**కళ్యాణ లక్ష్మీషాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

సంగారెడ్డి జూన్ 29 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా కేంద్రం లోని పీఎస్ఆర్ గార్డెన్ లో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి లతో కలిసి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు కళ్యాణ లక్ష్మి పథకం తో పాటు తులం బంగారం ఎప్పుడు ఇస్తారని చెప్పిన హామీ ఏమైందని గుర్తు చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ప్రతి మహిళకు నెలకు 2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన హామీ ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. వృద్ధులకు ప్రస్తుతం ఉన్న పెన్షన్ 2000 నుంచి 4000 వరకు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. మహిళలకు అందిస్తామని చెప్పిన స్కూటీల కోసం మహిళలు ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు ఎన్నికల హామీలన్నింటినీ వెంటనే అమలు చేసే ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటారా లేక హామీలే మిగిలిపోతాయా అని ప్రశ్నించారు. అన్ని వర్గాల



ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు ఇంకా ఒక సంవత్సరం మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని గత ప్రభుత్వం మీద ఇంకా ఎన్నో రోజులు ఆరోపణ చేస్తూ కాలం గడుపుతారని ఆయన అన్నారు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారికి ఇచ్చిన హామీలు గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఆలస్యం జరిగిందని ఇకపై ఇలాంటి పరిస్థితి రాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బీఎల్వోలు అందజేసిన ఫారాలను పూర్తి చేసి తిరిగి ఇవ్వాలి

- ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




సంగారెడ్డి, జూన్ 29 మనం ప్రతినిధి : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి ఓటరు పూర్తిగా నింపి తిరిగి సమర్పిస్తేనే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్వోలే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, ఈ బాధ్యతలను ఇతరులకు అప్పగించడం లేదా వారి ద్వారా సర్వే నిర్వహించడం అనుమతించబోదని స్పష్టం చేశారు. సూపర్వైజర్లు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యటిస్తూ బీఎల్వోల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన 1950 ఓటర్ హెల్ప్లైన్, కలెక్టరేట్, ఈఆర్వో కార్యాలయాల్లోని హెల్ప్డెస్క్ వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు హెల్ప్లైన్, హెల్ప్డెస్క్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విధుల నిర్వహణ సమయంలో బీఎల్వోలు ఎన్నికల సంఘం అందజేసి న టీ-షర్ట్, క్యాప్, ఐడీ కార్డు, బ్యాగ్ను తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. దీంతో ప్రజలు వారిని సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా, సహనంతో వ్యవహరించాలని బీఎల్వోలకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటరు అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి అధికారుల పర్యటనలు, ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందన్నారు. జిల్లాలో వంద శాతం ఫారాలు పంపిణీ చేసి, పూర్తిగా నింపిన ఫారాలను సేకరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓటరు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో ప్రజలకు అవసరమైన సహాయం అందించేలా బీఎల్వోలు, బీఎల్వో సూపర్వైజర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓలు రాజేందర్, రమేష్, వెంకటేశం, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం లభించాలి



- జిల్లా అదనపు కలెక్టర్లక్ష్మి కిరణ్

జిద్దిపేట జూన్ 29 మనం ప్రతినిధి: ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి 162 అర్జీలను ప్రజలు వివిధ సమస్యలపై సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యల పరిష్కారానికి అధికారులపై నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని ఈ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణికి 62 దరఖాస్తుల స్వీకరణ

- ప్రజావాణిలో ప్రజల వినతులు స్వీకరించిన నాగర్ జిల్లా కలెక్టర్

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 29 (మనం బ్యూరో): జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునే లక్ష్యంతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లోని ప్రదాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై భూ సమస్యలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, రెవెన్యూ, సంక్షేమ పథకాల అమలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, ఆరోగ్య సేవలు తదితర అంశాలపై తమ సమస్యలను లిఖితపూర్వకంగా జిల్లా కలెక్టర్, అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపిస్తూ, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక సమర్థ వేదికగా నిలుస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్,జిల్లా రెవెన్యూ అధికారి పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొని ప్రజల నుంచి అందిన వినతులను స్వీకరించి, సంబంధిత శాఖలకు ఆన్లైన్ ద్వారా పంపించారు.



# ప్రభుత్వానికి - ప్రజలకు మధ్య వారధి మీడియా

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




జగిత్యాల, జూన్ 29 (మనం న్యూస్): ప్రజలకు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడంలో మీడియా కీలకమైన వారధిగా పనిచేస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు 2026-28 సంవత్సరమునకు గాను అక్రిడిటేషన్ నూతన అక్రిడేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి వి. శ్రీధర్, విలేకరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్థంభమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాస్తవాలను నిష్పాక్షికంగా ప్రజలకు అందిస్తూ సమాజాభివృద్ధికి జర్నలిస్టులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు జర్నలిస్టుల విధి నిర్వహణలో ఎంతో ఉపయోగపడతాయని, బాధ్యతాయుతమైన వార్తలతో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని కోరారు.

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ**

ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా వారధిగా నిలుస్తోందన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ**

ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు వేగంగా, పారదర్శకంగా చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని అన్నారు. జర్నలిస్టులు వాస్తవాలను ధృవీకరించి బాధ్యతాయుతమైన వార్తలను అందించాలని సూచించారు.

జిల్లా యంత్రాంగం తరపున మీడియాకు ఎల్లప్పుడూ అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు.

# సిద్దిపేటలో బ్యాంకర్ల స్టాల్




సిద్దిపేట జూన్ 29మనం ప్రతినిధి : సిద్దిపేటలో సోమవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయంలో బ్యాంకర్ల స్టాల్ ను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసి లో లీడ్ బ్యాంక్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు, పేద వర్గాలకు వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాలు సంబంధించిన వివిధ రుణాలను సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించడం జరిగింది. అప్పటికప్పుడే లబ్ధిదారులను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా పాల్గొన్నట్లు ఎల్డీఎం హరిబాబు పేర్కొన్నారు.

# సాహిత్యం లేని సమాజాన్ని ఊహించలేం

- మనుషుల్ని కలిపివుంచేదే సాహిత్యం
- లోతైన అధ్యయనం పరిశీలన ద్వారానే సాహిత్యానికి పరిపుష్టి
- ప్రముఖ రచయిత శిరం శెట్టి



సిద్దిపేట, జూన్ 29; మనం ప్రతినిధిః విభిన్నప్రాంతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, వేర్వేరు అభిప్రాయలున్నప్పటికీ మనుషుల్ని కలిపివుంచేశక్తి సాహిత్యానికేవుందని ప్రముఖ కథా, నవలారచయిత శిరంశెట్టి కాంతారావు అన్నారు. సిద్దిపేటలో జరిగిన వెన్నెల సాహితీసంగమం వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై పర్కపెల్లి యాదగిరి కథల సంపుటి 'పొలిమేరదాటేవేళ' ఆవిష్కరించి ప్రసంగించారు. మనుషులలో క్రమశిక్షణ మానవీయ విలువలు పెంపొందించి మానవ సంబంధాలు విచ్ఛిన్నంకాకుండా సాహిత్యం కాపాడుతు ఒదన్నారు. అనాదిగా మౌఖికంగానో రాతపూర్వకంగానో సృజించిన సాహిత్యంవల్లనే మానవసంబంధాలు వెల్లివిరుస్తున్నాయని సాహిత్యంలేని సమాజాన్ని ఊహించలేమన్నారు. అందుకే కవులు రచయితలు మానవజీవితాలను ఇతివృత్తాలుగా తీసుకొని కథలుగా మలుస్తూ మెరుగైన సమాజనిర్మాణ దిశగా సాగాలని సూచించారు.కవులు పైపైన తడిమిచూసి రాసినంత మాత్రాన నాణ్యమైన సాహిత్యం రూపుదిద్దుకోదని లోతైన అధ్యయనం పరిశీలన ద్వారా మాత్రమే సాహిత్యానికి పరిపుష్టి చేకూరుతుందని , అన్నిప్రాంతాల సాహిత్య సొబగులను ఆకళింపు చేసుకున్నప్పుడే,నాణ్యమైన సాహిత్యాన్ని సృజియించ గలమని తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి అన్నారు.

భాషాపరిజ్ఞానం లేనికొందరు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ భాషలమధ్య ప్రాంతాల మధ్యచిచ్చురగిల్చి చలికాచుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, సృజనకారులుగా ప్రమాదాల్ని ముందేపసిగట్టి, సమాజాన్ని అప్రమత్తంచేస్తూ, మానవసంబంధాల్ని పెంపొందించాలని, అట్టడుగు జీవితాల్లోని వ్యధల్ని కథలుగా మలిచిప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాల్సివుందని పిలుపునిచ్చారు. వెన్నెలసాహితీ సంగమం విశాలదృక్పథంతో పనిచేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం కవి కంచరాన భుజంగారావు కవిత్వసంపుటి 'గీసిచెరిపేబొమ్మ'కు వెన్నెల సాహితీపురస్కారం 2025 అందజేశారు. సిద్దిపేటకు చెందిన ప్రముఖకవి పప్పుల రాజిరెడ్డికి 'జీవనసాఫల్యాపురస్కారం'అందజేశారు. కవులు, గాజె శ్రీధర్, అశోకరాజు, మహమూద్ పాషా, మహేష్, పాణి, మహిపాల్, మహేందర్, సుధాకర్, శ్రీధర్,సర్దార్ హుస్సేన్, విజయ, ఎడ్లలక్ష్మి, సునితారాణి, లక్ష్మారెడ్డి మధుసూధన్ రెడ్డి, పెద్దిరాజు, ప్రవీన్, వంగాలిరెడ్డి, ఉమాశంకర్, త్రివిక్రమ్, గరిపల్లి అశోక్, వెంకటేశ్వర్లు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో రైతు ఆశీర్వాద సభ వాయిదా..



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- రైతు భరోసా పంపిణీ అనంతరం ఘనంగా రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తాం
- రైతు సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం..
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, జూన్ 29(మనం బ్యూరో):** వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో జరగాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కరుణించాడని పేర్కొన్నారు. ఈ నెల 30న చింతకాని మండలం జగన్నాధపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో సభ వాయిదా నిర్ణయాన్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు. రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సభను వాయిదా వేస్తోందని పేర్కొన్నారు. తొలుత ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని భావించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జూలై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, పరిస్థితులు అనుకూలిస్తే జూలై 6, 7 లేదా 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఈ సభపై విశేష ఆసక్తి చూపుతున్నారని, వాతావరణం అనుకూలించిన వెంటనే నిర్వహించే రైతు ఆశీర్వాద సభ ప్రజలు ఊహించని స్థాయిలో విజయవంతం అవుతుందని డిప్యూటీ సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు తెలిపారు. రైతుల భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వర్షం అడ్డొచ్చినా రైతు సంక్షేమం ఆగదని, రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని, మంగళవారం హైదరాబాద్లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతు బంధు కింద రూ. 72 వేల కోట్లు అందించగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని అన్నారు. యూరియా పంపిణీ కోసం రూపొందించిన యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతూ ఉన్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, ఈ పాలనలో తెలంగాణలో రైతు రాజ్యం సాకారమై దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డిఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు నిర్విరామంగా సేవలందించిన

## ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

**ప్రజలకు నిర్విరామంగా సేవలందించిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం: జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 29(మనం ప్రతినిధి):** ప్రజలకు సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందుతున్న సీపీఓ కె. సంజీవరావు, డీవీఏహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు హౌసింగ్ ఏఈ , రమేష్బాబు, ఆఫీస్ సబార్డినేట్, హౌసింగ్ అంజనేయులకు ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన నాటి నుంచి ఉద్యోగికి సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, విధి నిర్వహణలో సంపాదించిన అనుభవం, ప్రజల ఆదరణ జీవితాంతం వెంట ఉంటాయని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలో ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడం గొప్ప విషయమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి తనవంతు కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. పదవీ విరమణతో ఉద్యోగ జీవితం ముగిసినప్పటికీ, సమాజానికి సేవ చేసే అవకాశాలు ఎన్నో ఉంటాయని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవాలను, విలువైన సూచనలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవడం ద్వారా వారికి మార్గదర్శకులుగా నిలవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతాయుత విధి నిర్వహణతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం ఉద్యోగ జీవితంలో అత్యంత గొప్ప విజయమని కలెక్టర్ అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకుంటూ, తమకు సహకరించిన జిల్లా యంత్రాంగం, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతే సహకార బ్యాంకుల ప్రగతికి పునాది

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కల్లూరులో పరిపాలన, మౌళిక వసతుల కేంద్రాలను తీర్చిదిద్దుతాం
- రైతు బలపడితేనే బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతం
- సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధికి మరిన్ని ప్రాజెక్టులు తీసుకొస్తాం
- కల్లూరులో డీసీసీబీ బ్రాంచి నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల
- ఎంఎల్ఏ మట్టా రాగమయి దయానంద్



ఖమ్మం, జూన్ 29(మనం బ్యూరో): సహకార బ్యాంకులు రైతులకు, గ్రామీణ ప్రజలందరికీ ఆర్థిక పరంగా అండగా నిలుస్తూ, పొదుపు, రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు పట్టణంలో సోమవారం ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) కల్లూరు బ్రాంచ్ నూతన భవనాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు మరింత చేరువలో, సౌకర్యవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కల్లూరులో నూతన భవనంలో డీసీసీబీ శాఖను ప్రారంభించామని తెలిపారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సహకార బ్యాంకులు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతుల ఆదాయం పెరిగి, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, తద్వారా మరింత మంది రైతులకు రుణాలు అందించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కల్లూరు బ్రాంచ్ ఆర్థికంగా బలమైన శాఖగా ఎదగడానికి వ్యాపారవేత్తలు, ప్రజలు తమ డిపాజిట్లను సహకార బ్యాంకులోనే ఉంచేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. బ్యాంకు బలోపేతమైతే స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న మంత్రి, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందన్నారు. కల్లూరుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేస్తూ, త్వరలో ఇంటిగ్రేటెడ్ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఆధునిక పరిపాలనా సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు.

కల్లూరు మండలంలో సాగునీరు, తాగునీరు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, మౌళిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. గతంలో మండల కార్యాలయాలు, కళాశాల భవనాలు, నీటి పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వేంసూరులో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభమైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. ఖమ్మం- అశ్వారావుపేట పాత రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. అలాగే గ్రీన్ఫీల్ జాతీయ రహదారికి ఎగ్జిట్, ఇతర మౌళిక వసతుల కల్పనకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంచి పేరును మరింత పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏ అవకాశం వచ్చినా ముందుగా సత్తుపల్లి నియోజకవర్గానికి తీసుకురావడానికి కట్టుబడి ఉంటానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేమట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంక్ ప్రయివేట్ బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే ఋణాలందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. రైతులకు ఎన్ని రకాల రుణాలు వస్తాయో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, ఏసీపీ వసుంధర యాదవ్, బ్యాంక్ సిఇఓ ఎన్.వెంకట ఆదిత్య, డిజిఎం ఎం.సర్వేశ్వర రావు, ఎజిఎం బి.చందర్ రావు, మేనేజర్ ఎం. అనిత, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బాగం నీరజ, కల్లూరు మునిసిపల్ చైర్మన్ ఎం.మోహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు



**ఖమ్మం, జూన్ 29(మనం బ్యూరో):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. శ్రీను తనకు గతంలో దివ్యాంగుల పెన్షన్ వచ్చేదని, సదరం సర్టిఫికెట్ చేసినప్పటికీ ఆగిపోయిందని తనకు పెన్షన్ మళ్ళీ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే. నాజియా తన కూతురికి తలసేమియా వ్యాధి ఉందని సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ మంజూరు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం హిమాంనగర్ గ్రామ పంచాయతీ ప్రజలు, విద్యార్థుల తల్లి దండ్రులు గ్రామపంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాల ఆక్రమణలను తొలగించి విద్యార్థుల సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కూసుమంచి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన చాగంటి శ్రీదేవి తనకు సర్వే నెంబర్ 591/1/2 లో రెండు ఎకరాల భూమి ఉందని, దానిని అక్రమంగా సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకోవడం జరుగుతుందని, ధరణిలో సర్వే నెంబర్ మిస్ మ్యాచ్ అయిందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కూసుమంచికి రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులతోనే ప్రగతి సాధ్యం

- రూ.1.65 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- మండలంలో ఉత్సహంగా అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**పాల్వంచ, జూన్ 29(మనం న్యూస్):** అభివృద్ధి పనులతోనే గ్రామాలలో ప్రగతి సాధ్యంని కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండల పరిధి లక్ష్మీదేవిపల్లి(ఎస్), బసవతారక కాలనీ, బిక్కు తండా, కేశవాపురం, నాగారం కాలనీ, రంగాపురం, సంఘం, దంతల బోర, నారాయణరావుపేట గ్రామపంచాయతీల పరిధిలో రూ. 1.65 కోట్లతో సీసీ రోడ్లకు డ్రైన్లకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. పల్లె రహదారులు, గ్రామాల అనుసంధాన రహదారులు, ప్రధాన రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. రహదారుల సౌకర్యం మెరుగు పడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామం, పంచాయతి కేంద్రాలలో హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామపంచాయతి కార్యాలయాలు, కమ్యూనిస్టుయి హాళ్లు, ప్రభుత్వ సేవాకేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా వారి సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్నానని, అభివృద్ధి నిధులు రాబట్టేందుకు ఏ అవకాశం వచ్చినా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం జరుగుతోందన్నారు. శంకుస్థాపనలు జరిగిన పనులు నాణ్యతా ప్రమాణాలతో పదికాలాలపాటు ప్రజలకు ఉపయోగపడేలా నిర్మాణాలు జరగాలని, అందుకు అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని, పనులను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలుసైతం పనులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, తహసిల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ రాజారావు, ఎంపీఓ షబానా, ఎంఇఓ శ్రీరామ్ మూర్తి, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ శాఖల అధికారులు, సీపీఐ నాయకులు నిమ్మల రాంబాబు, మన్నెం వెంకన్న, జకరయ్య, గిరి, గొర్లె నరేష్, ఆలపాటి ప్రసాద్, కాకటి రవీందర్, భుక్యా విజయ్, భూక్య రమేష్, మద్దల వీర మోహన్ రావు, ఆవుల సతీష్, తేజావత్ వినోద్, మాలోత్ హరి, బానోత్ రంజిత్, తేజావత్ ప్రేమ్ కుమార్, చంచలపురి శ్రీను, బాణాత్ రవి, వెల్లంకి శివరావు, లాల్ పాషా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ మాటలు..

## మతిలేనివి?

- ఎస్ఎల్బీసీపై మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కౌంటర్



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** కాంగ్రెస్ హయాంలో 34 కిలోమీటర్లు పూర్తి చేశాం.. తానొచ్చాకే ఎస్ఎల్బీసీ పూర్తి చేసి 3 లక్షల 60 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి అబద్దాలు మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. ఈ మేరకు... తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మీడియాతో కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మెదడుకు, పెదాలకు సంబంధం లేకుండా మాట్లాడుతున్నడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఏం మాట్లాడుతున్నడో మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నడని కర్నె ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణలో ఎక్కడికి పోయినా కానీ కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణ ప్రజలు తిరిగి కోరుకుంటున్నరు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకో అంటున్నరు . అన్నా ఎప్పుడొస్తవ్ కేసీఆర్ మాకు అండగా నువ్వే అని చెప్పి రైతాంగం ఎదురుచూస్తోంది. ఆ విషయం అర్థమై ఈ మధ్య వస్తున్నటువంటి అనేక సర్వేల్లో మైండ్ బ్లాంక్ అయి మెదడు దొబ్బి మొదటి ప్రసంగంలోనేమో ఎస్ఎల్బీసీ పూర్తయిందట.. ఆయన నీళ్లిస్తున్నడట అని కర్నె ప్రభాకర్ అన్నారు. దురదృష్టమేందంటే కనీసం 100 మీటర్లు కూడా కంప్లీట్ కాకముందే సొరంగం కూలిపోయి ఇంకా 8 శవాలు అక్కడే ఉన్నాయి. కానీ 10 సంవత్సరాల మా హయాంలో దాదాపు 11 కిలోమీటర్లు పూర్తి చేసి.. ఎస్ఎల్ బీసీ జీవితకాలపు సొరంగంగా మారిస్తే.. అది ఒక పెండింగ్ ప్రాజెక్టుగా మీరు పక్కకు పడేస్తే.. మేం పూర్తి చేద్దామని ప్రయత్నం చేస్తే నువ్వొచ్చినంక కేవలం 100 మీటర్లు కూడా పూర్తిచేయలేదుకదా.. దీంతోనే నీ అబద్దాలేందో చాలా స్పష్టంగా కనిపిస్తున్నయని కర్నె ప్రభాకర్ అన్నారు.

# ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 29 (మనంప్రతినిధి):** ప్రజల సమస్యలను సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ఫలితాలు సాధించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని , ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.

**ప్రజావాణి దరఖాస్తులలో ముఖ్యమైనవి**

చంద్రుగొండ మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ ప్రజలు గ్రామపంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, ప్రత్యేక గ్రామసభ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం చంద్రుగొండ ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం సీతారాంపేటకు చెందిన యానబోయిన మౌనిక తాను 2017లో డిప్లొమా ఇన్ ఫార్మసీ పూర్తి చేశానని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వ వైద్యశాలలో ఫార్మసిస్ట్ ఉద్యోగం కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. అశ్వాపురం మండలం మొండికుంట గ్రామపంచాయతీ పరిధిలోని మొండికుంట గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో 2023లో ప్రారంభించిన డ్రైనేజీ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు.

బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో తన తండ్రి జక్కం కృష్ణమూర్తి పేరుపై ఉన్న సర్వే నెం. 440/20/అ లోని 4 ఎకరాల 27 కుంటల భూమిని వారసత్వంగా తన పేరుపై మార్చి పట్టాదారు పాస్బుక్ మంజూరు చేయాలని బూర్గంపహాడ్కు చెందిన జక్కం శ్యామ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం బూర్గంపహాడ్ తహసీల్దార్కు ఎండార్స్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చట్టపల్లి ప్రాంతంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని లింగాల సాయికుమార్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# వీబీజీ రామ్జీ చట్టాన్ని ఉపసంహరించాలి

- ఉన్నతస్థాయి సమావేశంలో తేల్చిచెప్పిన మంత్రి సీతక్క
- వీబీజీ రామ్జీ చట్టంపై తెలంగాణ అభ్యంతరాలు వివరించిన మంత్రి సీతక్క
- రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే నిబంధనలను సవరించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్కు వినతిపత్రం
- క్యాబినెట్ నిర్ణయం అనంతరమే కొత్త చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయాలా వద్దా అన్న అంశంపై తెలంగాణ తుది నిర్ణయం
- పీఎం ఆవాస్, పీఎంజీఎస్వై, అటవీ అనుమతులు, పెండింగ్ నిధులపై కేంద్ర దృష్టికి కీలక అంశాలు

**న్యూఢిల్లీ, జూన్ 29: మనం ప్రతినిధి:** న్యూఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీజీ రామ్జీ చట్టం అమలుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను మంత్రి సీతక్క వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్కు రాష్ట్ర ప్రభుత్వ తరఫున వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క మాట్లాడుతూ, కొత్త చట్టంలో రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపే నిబంధనలు ఉన్నాయని, వాటిపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమై అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిందని తెలిపారు. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతన భారం 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించేదని, మెటీరియల్ కాంపోనెంట్లో కూడా కేంద్రం 75 శాతం వాటా కల్పించేదని గుర్తు చేశారు. కొత్త విధానంలో 60:40 నిష్పత్తి అమలు చేయడం వల్ల రాష్ట్రాలపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వాటా కొన్ని వందల కోట్ల రూపాయల పరిధిలో ఉండగా, కొత్త విధానంలో తెలంగాణ వాటా సుమారు రూ.2,000 కోట్ల వరకు పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. వీబీజీ రామ్జీ చట్టంలో ప్రతిపాదించిన కొన్ని నిబంధనలు పేదలు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండా చట్టాన్ని తీసుకురావడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. చట్టానికి పేరు మార్చడమే కాకుండా, అమలులో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక బాధ్యతలు మోపడం సరైన విధానం కాదన్నారు. అదేవిధంగా తెలంగాణకు సంబంధించిన ఇతర కీలక అంశాలను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పీఎం ఆవాస్ యోజన కింద రెండు సంవత్సరాల క్రితమే తెలంగాణ ప్రభుత్వం లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి కేంద్రానికి పంపించినప్పటికీ ఇప్పటికీ ఇళ్ల మంజూరు జరగలేదని, వెంటనే ఆమోదం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద తెలంగాణలో మంజూరైన అనేక రహదారి పనులు అటవీ, వన్యప్రాణి అనుమతుల సమస్యలతో నిలిచిపోయాయని తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నల్లమల, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో రోడ్లు, నివాసాలు, బోర్లు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం కూడా అటవీ అనుమతుల కారణంగా నిలిచిపోతోందని వివరించారు. రోడ్లకు కేంద్రం మంజూరు ఇచ్చినప్పుడే అటవీ శాఖ నుంచి అవసరమైన క్లియరెన్సు కూడా కల్పించే విధానం తీసుకురావాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈ అంశాలపై సానుకూలంగా స్పందించారని, అటవీ అనుమతుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. వీబీజీ రామ్జీ చట్టంపై తెలంగాణ ప్రభుత్వ వైఖరి స్పష్టమని, రాష్ట్ర ప్రయోజనాలు, గ్రామీణ పేదల సంక్షేమం, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే మంత్రివర్గం తుది నిర్ణయం ప్రకటిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కొత్త చట్టంలో చేరాలా, వద్దా అనే అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం అధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ నిర్ణయం తెలియజేస్తామని మంత్రి తెలిపారు.

సమావేశంలో నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన మంత్రి సీతక్క వీబీజీ రామ్జీ చట్టానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన అభ్యంతరాలు, సూచనలను సమావేశంలో మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను హక్కు ఆధారిత కార్యక్రమంగానే కొనసాగించాలని, ప్రతిపాదిత వీబీజీ రామ్జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త చట్టం గ్రామీణ పేదల పని హక్కును బలహీనపరచడంతో పాటు గ్రామ పంచాయతీల అధికారాలను తగ్గించి, రాష్ట్రాల పాత్రను పరిమితం చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రణాళిక, పనుల ఎంపిక, నిధుల కేటాయింపు, అమలు, పర్యవేక్షణ వంటి కీలక అధికారాలను కేంద్రం వద్దే కేంద్రీకరించడం సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా మాత్రమే నిధుల కేటాయింపు చేయడం సమంజసం కాదని, గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న వాస్తవ ఉపాధి డిమాండ్ను పరిగణనలోకి తీసుకుని నిధులు కేటాయించాలని తెలంగాణ సూచించింది. గత ఐదేళ్లలో రాష్ట్రాలకు కల్పించిన పని దినాలకు 80 శాతం, ఆర్థిక సంఘం సిఫార్సులకు 20 శాతం వెయిటేజీ ఇవ్వాలని ప్రతిపాదించింది. వెనుకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, ఐదో షెడ్యూల్ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి కోరారు.

## భూ నిర్వాసితులు ఎమ్మార్వోకు వినతి పత్రం



**భీమదేవరపల్లి జూన్ 29 మనం న్యూస్:** భీమదేవరపల్లి గౌరవెల్లి కాలువ భూ నిర్వాసితులు ఎమ్మార్వో రాజేష్ కు వినతిపత్రం అందజేశారు. సోమవారం రోజున తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్వో రాజేష్ కు వినతి పత్రం అందజేసిన అనంతరం రైతన్నలు మాట్లాడుతూ భీమదేవరపల్లి మండల పరిధిలోని గ్రామాల నుండి గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసంరైతన్నలు భూదానం చేయగా నష్టపరిహారం అధిక మొత్తంలో కావాలని రైతన్నకు సాయం చేయాలని ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశామని తెలిపారు.

## ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించకుంటే
# కఠిన చర్యలు తీసుకోక తప్పదు



- ప్రజావాణికి 29 ఫిర్యాదుల స్వీకరణ
- ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలి
- అధికారులు విద్యాలయాలు, వసతి గృహాలను తప్పక సందర్శించాలి
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 29 (మనం బ్యూరో):** ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించకుండా అలసత్వం చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం 29 ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించడం జరిగిందన్నారు. మండల స్థాయిలోనూ వచ్చిన ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణి పోర్టల్ లో ప్రజల నుంచి వచ్చిన ఆర్జీల వివరాలను అప్లోడ్ చేస్తుండడంతో రాష్ట్రస్థాయిలోనూ ఉన్నతాధికారులు వీటిని పర్యవేక్షిస్తుంటారని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో పెద్ద ఎత్తున ఆర్జీలు పెండింగ్ లో ఉంచడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి బుధవారం వివిధ శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే సోమవారంలోగా పెండింగ్ లో ఉన్న ఆర్జీలను పరిష్కరించాలన్నారు. అలసత్వం చూపే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రజావాణి పోర్టల్ లో లాగిన్ అయి తమకు సంబంధించిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ ఫరాల పంపిణి ప్రక్రియ బూత్ లెవెల్ అధికారుల పని తీరును మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. విద్యాలయాలు, వసతిగృహాలను సంబంధిత అధికారులు తరచు సందర్శిస్తూ, అక్కడి కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాలను కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో మూడు చొప్పున ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తున్నామన్నారు. అక్కడి సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు మరమ్మత్తుల పనులు కూడా జరుగుతున్నాయని సంబంధిత అధికారులు సకాలంలో పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు అందజేయడం జరిగిందని సాధ్యమైనంత తొందరగా యూనిఫామ్స్ కూడా ఇచ్చేలా స్టిచ్చింగ్ వేగవంతం చేయించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హ్యాం రోడ్లతో రాష్ట్ర రూపురేఖలు మారుతాయి

- రోడ్లు అభివృద్ధికి సూచికలు
- బీఆర్ఎస్ హయంలో రోడ్ల అభివృద్ధిని విస్మరించింది
- రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి




**నల్లగొండ-- జూన్ 29 ( మనం ప్రతినిధి ):** హ్యాం రోడ్లతో రాష్ట్ర రూపురేఖలు మారుతాయని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని ప్రకాశం బజార్ లో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘువీర్ రెడ్డికి విషెస్ తెలిపారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు అభివృద్ధి చెందితే పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని, పరిశ్రమలు ఏర్పడడానికి అవకాశం ఉంటుందన్నారు. దీంతో స్థానిక యువత, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యే హం ప్రాజెక్టుకు నల్గొండ జిల్లాలోని కనగల్ మండల కేంద్రంలో పైలాన్ ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మినిస్టర్ గా తాను రెండు సంవత్సరాల కాలంలోనే రూ.7,110 కోట్ల ప్లాన్ అండ్ నాన్ ప్లాన్ కింద నిధులు మంజూరు చేయించుకుని రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా సిఆర్ఐ కింద జంక్షన్లు, సీసీ రోడ్లకు రూ.1900 వందల కోట్లను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కలిసి మంజూరు చేయించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రెండు రోజులలో మరోసారి ఢిల్లీకి వెళ్లి రోడ్ల కోసం మరో రూ.1000 కోట్లను మంజూరు చేయించుకోవడం జరుగుతుందని వెల్లడించారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో రోడ్ల అభివృద్ధికి రూ.2,500 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. విజయవాడ-హైదరాబాద్ ఫోర్ లైన్ కోసం టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. అదేవిధంగా రీజనల్ రింగ్ రోడ్డు టెండర్లు పిలవడం జరిగిందని, జూలై 6న టెండర్లు జరుగుతాయన్నారు. రూ.11 వేల కోట్లతో ఈ రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. రూ.13 వేల కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లను ఫైనల్ చేసి పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్లు అభివృద్ధికి సూచికలని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. ఈ పరిశ్రమ పెట్టాలన్న రోడ్లు అభివృద్ధి చెందాలన్నారు. దీంతో స్థానిక యువతకు నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. రూ.26 వేలకోట్లతో ఆర్ అండ్ బి శాఖ ద్వారా, రూ.40 వేల కోట్లతో నేషనల్ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. గుర్రంపూడు దాటిన తర్వాత 3 కిలోమీటర్ల పక్క నుంచి గ్రీన్ ఫీల్ సిటీ హైవే బందర్ వయా అమరావతి వరకు డిపిఆర్ పూర్తయి టెండర్ స్టేజ్ లో ఉందన్నారు. మన్ననూరు-శ్రీశైలం 52 కిలోమీటర్ల ఎలివేటర్ కారిడార్ ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. మూడు నెలల్లో డిపిఆర్ ఫైనల్ అయితే క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత పనులు ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## కన్నాయిగూడెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా పీరీల స్వప్న ఏకగ్రీవ ఎన్నిక



- నూతన అధ్యక్షురాలు పీరిల స్వప్న

**కన్నాయిగూడెం, జూన్ 29, మనం ప్రతినిధి,:** కన్నాయిగూడెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో పీరిల స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని సర్పంచులు అందరూ ఏకమై ఆమె పేరును ప్రతిపాదించడంతో ఎన్నిక ఏకగ్రీవంగా పూర్తయింది. ఎన్నిక అనంతరం మాట్లాడిన నూతన అధ్యక్షురాలు పీరిల స్వప్న, మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ వాడవాడలా అభివృద్ధి చెందేలా అందరం సమిష్టిగా కృషి చేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అన్నారు. సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ పిరిల సురేష్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి అనేది ఒక్క అధ్యక్షురాలి బాధ్యత కాదు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని ఒక కుటుంబంగా భావించి పని చేయాలి. యువతకు ఉపాధి అవకాశాలు, వ్యవసాయానికి ఆధునిక సహాయం, డిజిటల్ లైబ్రరీలు, క్రీడా మైదానాల అభివృద్ధి మన ప్రధాన ఎజెండా. ప్రతి గ్రామంలో పచ్చదనం పెంచి, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిద్దడం కోసం ఫోరం తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అధ్యక్షురాలు పీర్ల స్వప్న గారి నాయకత్వంలో మన మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచేలా అందరం కలిసి పని చేద్దాం' అని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకుంటామని, అధికారులతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పీర్ల స్వప్న స్పష్టం చేశారు. సర్పంచులందరి సహకారంతో మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మం డలంగా తీర్చిద్దుతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు తిప్పనపల్లి లక్ష్మయ్య. ప్రధాన కార్యదర్శి అంబాల సౌజన్యం. కోశాధికారి అల్లెం అనిత. వర్కింగ్ ప్రెసిడెంట్ పిరిల సురేష్. కార్యవర్గ సభ్యులు జాడి రాంబాబు. చింత చంద్రయ్య. కోరం నరసయ్య. పొడెం నర్సింగరావు. ఆగ్గ రోజా. కుర్సం రమాదేవి. పాల్గొన్నారు.

## ములుగు జిల్లా ప్రజల కోసం 'డైల్ యువర్ డీఎం ' కార్యక్రమం



**ములుగు, జూన్ 29, మనం ప్రతినిధి,** వరంగల్ సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపించేందుకు వరంగల్-2 డిపో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వరంగల్-2 డిపో మేనేజర్ s రవిచందర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా తేదీ: 30-06-2026, మంగళవారం ఉదయం 10:00 గంటల నుండి 11:00 గంటల వరకు డైల్ యువర్ ్ర్ క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాకు చెందిన ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు అలాగే ఖఫీఇ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ఈ మండలాల ప్రజలు పాల్గొనవచ్చు: ములుగు, వెంకటపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు మరియు వెంకటాపురం మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు. సంప్రదింపు నెంబర్:ఫిర్యాదులు లేదా సూచనలు తెలియజేయాలనుకునే వారు 7382425150 నెంబర్కు ఫోన్ చేయవచ్చు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రవిచందర్ గారు స్పష్టం చేశారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 29 (మనం బ్యూరో):** నాగర్కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, పాఠ్యపుస్తకాలు, ఆహార సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాఠశాల నిర్వహణ తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థినులతో నేరుగా మాట్లాడి బోధన, పాఠ్యాంశాల అవగాహన, ఉపాధ్యాయుల బోధనా విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ గదులు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత, విద్యుత్, భద్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ......, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థినికి కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థినులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదీ లేదో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వారి విద్యా పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు స్పందించాలన్నారు. పాఠశాల నిర్వహణలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో చర్చించిన కలెక్టర్, లోపాలను వెంటనే గుర్తించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం పెండింగ్లో ఉందని ప్రత్యేక అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, సంబంధిత శాఖల అధికారులతో పాటు తదితరులు ఉన్నారు.

# నాణ్యతలో రాజీ లేకుండా గడువులోగా పనులు పూర్తి చేయాలి

- ప్రభుత్వం ఆమోదించిన నమూనా ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలి
- జట్రపోల్ గ్రామంలో తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 29 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జట్రపోల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్ఠాత్మక తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సోమవారం ఉదయం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థ పనుల పురోగతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల అమలులో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. నిర్ణయించిన లక్ష్యాల ప్రకారం పనులను ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల భవనంలోని తరగతి గదులు, పరిపాలనా విభాగం, బాలురు, బాలికల వసతి గృహాలు, డైనింగ్ హాల్, వంటశాల, ప్రయోగశాలలు, గ్రంథాలయం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, అంతర్గత రహదారులు, ప్రహరీ గోడ తదితర నిర్మాణ పనులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం ఆమోదించిన మ్యాప్కు అనుగుణంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయా లేదా అనే అంశాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి అవసరమైన సాంకేతిక సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంపొందించేందుకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యాధునిక విద్యా, వసతి, క్రీడా సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందించాలనే లక్ష్యంతో ఈ విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు ప్రభుత్వం ఆమోదించిన నమూనా ప్రకారం, ఇంజనీరింగ్ ప్రమాణాలను పూర్తిగా పాటిస్తూ చేపట్టాలని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదన్నారు. నిర్మాణంలో ఉపయోగించే ప్రతి నిర్మాణ సామగ్రి నాణ్యమైనదిగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తిగా ఈ పాఠశాల భవనం నిలవాలంటే ప్రతి పనిని అత్యంత బాధ్యతతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ పనుల పురోగతిని వేగవంతం చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, సంబంధిత శాఖల అధికారులు, ఇడబ్ల్యుఐడీసీ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రిమండలిలో మార్పులు?



వర్షాకాల సమావేశాల్లోపే పునర్ వ్యవస్థీకరణ!

గవర్నర్లుగా కొందరికి..

పార్టీలో ఇంకొందరికి అవకాశం

బీజేపీ గూటికి చేరినవారికీ పదవులు

స్పీకర్ నిర్ణయం కీలకం

**ఢిల్లీ, జూన్ 29:** కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇలాంటి అంశాలపై చివరి క్షణం వరకు గోప్యత పాటించడం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకత అయినా వివిధ సంకేతాలను బట్టి.. ఇప్పటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోగా ఏ క్షణమైనా పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని భావిస్తున్నారు. మంత్రిమండలిలో ఇప్పటికే ఖాళీగా ఉన్న, త్వరలో ఖాళీ కాబోతున్న స్థానాలను భర్తీచేయడంతోపాటు తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) వంటి పార్టీల నుంచి చీలికవర్గం ఎంపీలు ప్రత్యేక వర్గాలుగా ఏర్పడి బీజేపీకి మద్దతు ప్రకటిస్తుండటంతో వాటి నుంచీ కొందరికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉంది. బీజేపీ నూతన సారథి నితిన్ నబీన్ జట్టులో కీలకమైన పదవుల్ని కొంతమంది యువ నేతలకు అప్పగించే అవకాశముందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీ పదవుల జాబితా దాదాపు కొలిక్కి వచ్చింది. కొందరు కేంద్ర మంత్రులతో నబీన్ కొద్దిరోజుల క్రితం చర్చలు జరిపారు. కొత్తవారిని మంత్రులుగా తీసుకోవడం, కొందరి శాఖల్ని మార్చడం వంటి వాటిపై సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సోమవారం వరకు సీషెల్స్ పర్యటనలో ఉండే ప్రధాని మోదీ తిరిగి జులై 6 నుంచి 11 వరకు విదేశాల్లో ఉంటారు. జపాన్ ప్రధాని సనాయె తకాయిచి జులై 1 నుంచి 3 వరకు మన దేశంలో పర్యటించనున్నారు. అందువల్ల ప్రధాని వెసులుబాటును బట్టి మంత్రిమండలిలో మార్పులు చేపట్టనున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి కొందరు ఎంపీలను మంత్రిమండలిలోకి తీసుకోనున్నారు. షిండే నేతృత్వంలోని శివసేన పార్టీ నుంచి ఒక సీనియర్ నేతకు క్యాబినెట్ మంత్రి పదవి లభించనుందని తెలుస్తోంది. తృణమూల్, శివసేన (యూబీటీ) చీలిక వర్గాల్లో ఎవరికైనా అవకాశం ఇచ్చేముందు స్పీకర్ నిర్ణయం కీలకం కానుంది.

**గవర్నర్లుగా కేంద్ర మంత్రులు!**

గవర్నర్లుగా థావర్‌చంద్ గహ్లోత్ (కర్ణాటక), మంగూభాయ్ పటేల్ (మధ్యప్రదేశ్), గుర్మీత్‌సింగ్ (ఉత్తరాఖండ్)ల పదవీ కాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుత మంత్రుల్లో కొందరిని వీరి స్థానాల్లోకి పంపిస్తారని, ఆ మేరకు మంత్రిమండలిలో యువ రక్తాన్ని తీసుకువస్తారని చెబుతున్నారు. ఆప్ నుంచి విడిపోయి బీజేపీలో చేరుతున్న ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరిద్దరికి విస్తరణలో బెర్తులు ఖాయం కానున్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ డిజిటల్ మూల్యాంకనంలో తప్పిదాల తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భవితవ్యం డోలాయమానంలో పడింది. రాజ్యసభ సభ్యులుగా నవంబరులో పదవీకాలం ముగిసిపోతున్న వారిలో కేంద్ర మంత్రులు హర్‌దీప్‌సింగ్ పురీ, బి.ఎల్.వర్మ ఉన్నారు. వారికి మరో అవకాశం లభిస్తుందా..లేదా అనేది తేలాలి. పంకజ్ చౌధరీ, హర్ష్ మల్హోత్రాలకు యూపీ, ఢిల్లీ రాష్ట్రశాఖల పార్టీ బాధ్యతల్ని అప్పగించారు. 'ఒకరికి ఒకే పదవి' నిబంధన కింద వీరిద్దరినీ మంత్రివర్గం నుంచి తప్పించేందుకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్జి కురియన్, రవ్నీత్ సింగ్ బిట్టూల రాజ్యసభ పదవీ కాలం ఈ నెల 21న ముగిసింది. మంత్రి పదవికి కురియన్ రాజీనామా సమర్పించారు. పంజాబ్ ఎన్నికలపై దృష్టి పెట్టాల్సిందిగా బిట్టూకు పార్టీ సూచించినట్లు సమాచారం. ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌ల నుంచి పలువురికి ఈసారి మోదీ బృందంలో మంత్రులుగా అవకాశం రావచ్చని సమాచారం. ఈ మూడు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.

# మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం..

## 65 ఏళ్ల వృద్ధుడికి మరణశిక్ష



**పూణె, జూన్ 29:** మహారాష్ట్రలోని పూణెలో మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం కేసులో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషిగా తేలిన 65ఏళ్ల భీమ్‌రావ్ అనే వృద్ధుడికి మరణ శిక్ష విధించింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పరిగణించిన న్యాయస్థానం.. శిక్ష తగ్గించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. 2026 మే 1న జరిగిన ఈ హత్యాచార ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

మహారాష్ట్రలోని నస్రాపూర్ గ్రామానికి చెందిన భీమ్‌రావ్ అప్పుడే పుట్టిన దూడను చూపిస్తానని చెప్పి చిన్నారిని నిర్మానుష్య ప్రదేశంలో ఉన్న ఓ పశువుల షెడ్డులోకి తీసుకువెళ్లాడు. అక్కడ ఆ పాపపై అత్యాచారానికి పాల్పడిన అనంతరం బండ రాయితో కొట్టి హత్య చేశాడు. కనిపించకుండా పోయిన చిన్నారి కోసం కుటుంబసభ్యులు వెతకగా.. షెడ్డులో మృతదేహం లభ్యమవ్వడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఈ కేసును స్వయంగా పర్యవేక్షించారు. కేసుపై విచారణ చేపట్టిన పూణె ఫాస్ట్-ట్రాక్ కోర్టు తాజాగా తుది తీర్పు వెలువరించింది.

# ముంబయిలో భారీ వర్షం..


## జలమయమైన రహదారులు



**ముంబయి, జూన్ 29:** ముంబయిని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆదివారం రాత్రి కేవలం నాలుగు గంటల్లోనే 100మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం ప్రభావంతో సబర్బన్ రైలు సర్వీసులకు అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలవడంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వీణా నగర్‌లో అత్యధికంగా 160.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ వెల్లడించింది.

వర్షం కారణంగా అంధేరి ప్రాంతంలోని సబ్వే పూర్తిగా నీట మునిగింది. దీంతో ముందస్తు చర్యగా ఈ అండర్‌పాస్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు బీఎంసీ వెల్లడించింది. మరోవైపు వాతావరణం అనుకూలంగా లేనందున విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ పలు ప్రాంతాలకు రెడ్, ఆరెంజ్ అలర్టు జారీ చేసింది.

# ఖమేనీ అంత్యక్రియలు.. భారత్ తరఫున వెళ్లేది వీరే..!



**ఢిల్లీ, జూన్ 29:** అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జులై 5 నుంచి 9 వరకు అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. భారత్ తరఫున కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరిటా, బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ హాజరుకానున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇరాన్ వర్గాలు పేర్కొనగా.. దీనిపై ఇంతవరకు భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన తొలి రోజే 86 ఏళ్ల అలీ ఖమేనీ సహా 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందగా.. కుమారుడు మొజ్తాబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. జులై 9న ఖమేనీ స్వస్థలం మషాద్లో ఆయనను ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రెండు కోట్లకు మంది వరకు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

**మొజ్తాబా ఖమేనీ ఇకనైనా కనిపిస్తారా..?**

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి బహిరంగంగా కనిపించని అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీపైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ఈ కొత్త సుప్రీం లీడర్ తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంటారా..? రహస్య ప్రాంతం నుంచి దేశాన్ని నడిపిస్తోన్న ఆయన ఇప్పుడైనా బహిరంగంగా కనిపిస్తారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని సుప్రీం లీడర్ ఉన్న కాంపౌండ్‌పై జరిగిన దాడుల్లో మొజ్తాబా గాయపడ్డారు. ఆయన కాలికి తీవ్ర గాయం కావడంతో పాటు ముఖమంతా కాలిపోయినట్లు ఆ దేశ మీడియా గతంలో వెల్లడించింది. మొజ్తాబా ఖమేనీ బతికే ఉన్నారని, ఆయనను రహస్య ప్రాంతంలో ఉంచి చికిత్స అందిస్తున్నారని పేర్కొంది. ఇజ్రాయెల్ నిఘాకు దొరకకుండా ఉండటం కోసం.. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కూడా ఆయనను కలిసేందుకు వెళ్లడం లేదని వార్తలు వచ్చాయి. పాలనా వ్యవహారాల్లో మాత్రం మొజ్తాబా పేరు వినిపిస్తోంది. ఆయన పేరిటే ప్రభుత్వ ప్రకటనలు వస్తున్నాయి. కానీ సుదీర్ఘకాలంగా మొజ్తాబా బహిరంగంగా కనిపించకపోవడంతో ఆయన ఆరోగ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమం లోనే వాటికి చెక్ పెట్టేలా అంత్యక్రియల్లో మొజ్తాబా కనిపిస్తారా..? అనే చర్చ మొదలైంది. అలీ ఖమేనీ మరణించిన తర్వాతే మొజ్తాబాను సుప్రీం లీడర్‌గా ఎన్నుకొన్న సంగతి తెలిసిందే.

## కేతన్ నుంచి రూ.కోటి తీసుకొని ప్రియుడికి ఇచ్చిన సియా..!



**పూణె, జూన్ 29:** పూణె యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసును పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దీంతో ఎప్పటికప్పుడు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పెళ్లి షాపింగ్ కోసమంటూ కేతన్ నుంచి నిందితురాలు సియా రూ.కోటి రూపాయలు తీసుకుందని తెలుస్తోంది. తర్వాత ఆ డబ్బును ప్రియుడు చేతన్‌కు ఇచ్చిందని దర్యాప్తులో భాగంగా వెల్లడైంది. సియా-చేతన్ వేసిన ప్లాన్‌లో ఇది కూడా భాగమని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

సియా-చేతన్.. కేతన్ హత్యకు ప్లాన్ చేయడమే కాకుండా భవిష్యత్ ప్రణాళికలు వేసుకున్నారట. తమ మీద ఎలాంటి అనుమానం రాకుండా చూసుకునేందుకు కేతన్‌ను అడ్డు తొలగించుకున్న కొన్ని సంవత్సరాల తర్వాత వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తమ ప్లాన్‌లో భాగంగానే కేతన్ నుంచి సియా రూ.కోటి తీసుకుంది. వివాహ ఖర్చులకు దానిని వాడుకోకుండా చేతన్‌కు ఆ డబ్బు ఇచ్చింది. తమది ధనిక కుటుంబం కాకపోవడంతో ఆర్థికంగా స్థిరపడేందుకు కనీసం మూడు సంవత్సరాలు పడుతుందని సియాకు చేతన్ చెప్పినట్లు సమాచారం. దీంతో ప్రియుడిని సెటిల్ చేసేందుకే ఆ డబ్బు ఇచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# ఈలోపే మిన్ను విరిగి మీద పడదులే..

## అయోధ్య విరాళాల దుర్వినియోగం కేసులో సుప్రీం



**ఢిల్లీ, జూన్ 29:** అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. వేసవి సెలవుల అనంతరం దానిని విచారణకు స్వీకరిస్తామని ధర్మాసనం పేర్కొంది. 'ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది.

**నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దు.. న్యాయవాదుల నిర్ణయం**

మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ఫైజాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. "ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం" అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.



# మోహినీ అవతారంలో పల్లకిపై దివ్య విహారం

## భక్తులను అనుగ్రహించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

**తిరుపతి జూన్29 మనంన్యూస్:** అప్పలాయగుంటలో వైభవంగా జరుగుతున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై విహరిస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు.స్వామివారి మనోహర రూపాన్ని దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గోవింద నామస్మరణతో మారుమోగిన మాడవీధులు ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పల్లకీ వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ, గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం



**మంత్రాలయం , జూన్ 29,మనం న్యూస్:** మంత్రాలయం మండల సుంకేశ్వరి గ్రామంలో గ్రామ దేవత లక్ష్మమ్మ అవ్వ వార్షిక రథోత్సవం భక్తిశ్రద్ధల మధ్య సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు లక్ష్మమ్మవ్వ పంచామృతాభిషేకాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై లక్ష్మమ్మవ్వ చిత్రపటాన్ని ఉంచి పూజలు చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారి రథాన్ని గ్రామ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అంతకు ముందు గ్రామస్తులు పిండి వంటలు, చేసి నైవేద్యాలుతయారుచేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ రథోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రథోత్సవం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తహసిల్దారులు తమ తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలి

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 29 (మనం బ్యూరో):** ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్లో ఓటరుగా వారి పేరు ఉంటుందని ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఐఆర్ పై హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో కలిసి వీసీలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ఎన్నుమరేషన్ ఫామ్స్ ను బీఎల్వోలే స్వయంగా అందజేయాలని స్పష్టం చేశారు. ఇతర వ్యక్తులకు బాధ్యతలు అప్పగించడం, వారి ద్వారా సర్వే చేయించడం తీవ్ర నిర్లక్ష్యంగా పరిగణిస్తామన్నారు. అటువంటి ఘటనలపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్వైజర్లు క్రమం తప్పకుండా తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ బీఎల్వోల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన 1950 ఓటర్ హెల్ప్‌లైన్, కలెక్టరేట్, ఈఆర్వో కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్ వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యత ఉన్నందున ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రతి బుధవారం బిఎల్ఎలతో బిఎల్ఓలు సమావేశాలు నిర్వహించుకుని సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జిల్లా వెనుకబడిందన్నారు. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలో వేగవంతం కావాలని ఆదేశించారు. తహసీల్దార్ లు తమ మండలాల్లో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోవడంతో ప్రజలు కలెక్టరేట్ కు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ స్కీమ్ ను అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకునేలా సహకరించాలన్నారు. పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా తరచూ రేషన్ దుకాణాలను పర్యవేక్షించాలన్నారు. టాస్క్ ఫోర్స్ సభ్యులతో కలిసి ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాలపై నిఘా ఉంచాలన్నారు. గ్రామాల రీసర్వే కు అవసరమైన లైసెన్స్ సర్వేయర్లను గుర్తించి ముందుకెళ్లాలన్నారు. ఆయా మండలాల డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ తయారుచేసి అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే తహసీల్దారులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, ఆయా మండలాల తహసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీమా కంపెనీలో బోలేడు డబ్బు..

'రూ.9,000 కోట్లు నో క్లెయిమ్'

నామినీలకు తెలియని పాలసీల సమాచారం

మారిన చిరునామాలు.. ఫోన్ నెంబర్లతో భారీ తిప్పలు

కంపెనీ వెబ్‌సైట్‌ల ద్వారా చెక్ చేసుకునే అవకాశం

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** బీమా పాలసీదారులకు, వారి కుటుంబ సభ్యులకు చెందిన దాదాపు రూ.9,000 కోట్ల రూపాయలు లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల వద్ద క్లెయిమ్ చేయకుండా పేరుకుపోయాయి. చాలా సందర్భాల్లో నామినీలకు పాలసీ ఉన్న విషయమే తెలియకపోవడం, పత్రాలు పోగొట్టుకోవడం లేదా పాలసీదారులు తమ వివరాలను అప్డేట్ చేయకపోవడం వంటి కారణాలతో ఈ భారీ మొత్తం ఎవరికీ చెందకుండా మిగిలిపోయింది. ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన వివరాల ప్రకారం, 2026 ఫిబ్రవరి 28 నాటికి రూ.8,973.89 కోట్ల క్లెయిమ్ చేయని నిధులు బీమా సంస్థల వద్ద ఉన్నాయి. నిబంధనల ప్రకారం, పాలసీ డబ్బు చెల్లించాల్సిన గడువు ముగిసిన 12 నెలల వరకు ఎవరూ క్లెయిమ్ చేయకపోతే దానిని 'అన్ క్లెయిమ్డ్'గా పరిగణిస్తారు. పదేళ్ల తర్వాత ఈ డబ్బును ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ చేసినప్పటికీ, పాలసీదారులు లేదా? వారి వారసులు 25 ఏళ్ల వరకు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

నామినీలకు 'నో సమాచారం'.

కుటుంబ సభ్యులకు పాలసీ ఉందనే విషయం తెలియకపోవడమే దీనికి అతిపెద్ద కారణంగా నిపుణులు చెబుతున్నారు. ఇటీవల ఢిల్లీకి చెందిన ఓ మహిళ, తన తండ్రి మరణించిన కొన్ని నెలల తర్వాత ఆయన ఇన్సూరెన్స్ పాలసీ గురించి ఒక ఈమెయిల్ ద్వారా తెలుసుకున్నారు. ఆ తర్వాత అసలు పత్రాలను గుర్తించి, దాదాపు రూ.4 లక్షల మెచ్యూరిటీ మొత్తాన్ని పొందగలిగారు. అయితే, ఇలాంటి ఘటనలు సర్వసాధారణమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

కవర్ష్యూర్ వ్యవస్థాపకుడు సౌరభ్ విజయ్ వర్గియా ప్రకారం, ఎండోమెంట్, మనీ-బ్యాక్ వంటి సంప్రదాయ పాలసీలు 15 నుంచి 30 ఏళ్ల పాటు కొనసాగుతాయి. ఈ సుదీర్ఘ కాలంలో పాలసీదారులు చిరునామా, ఫోన్ నంబర్, నామినీ వివరాలను మార్చడం మర్చిపోతారు. ఇదే అన్క్లెయిమ్డ్ మొత్తాలు పెరగడానికి కారణమవుతోంది. క్లెయిమ్ చేయని నిధుల్లో ఎక్కువ భాగం లైఫ్ ఇన్సూరెన్సుకు సంబంధించినదే. ఇందులో మెచ్యూరిటీ డబ్బు, డెత్ క్లెయిమ్స్, సరెండర్ విలువలు, సర్వైవల్ బెనిఫిట్స్ వంటివి ఉన్నాయి. ఇక హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ విషయానికి వస్తే, అసంపూర్తిగా ఉన్న రీయింబర్స్‌మెంట్లు, ప్రీమియం రిఫండ్లు, పూర్తికాని క్లెయిమ్ ప్రాసెస్ల వల్ల డబ్బు మిగిలిపోతోంది.

**బీమా ఉందో? లేదో ఎలా చూడాలి?**

ముందుగా.. మీకు, లేదా? మీ కుటుంబ సభ్యులకు సంబంధించిన పాత పాలసీ పత్రాలు, ఈమెయిళ్లు, ప్రీమియం రసీదులు, బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలించాలి. ఆ తర్వాత సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి, పాలసీ నంబర్, పాలసీదారుని పేరు, పాన్ నంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు ఎంటర్ చేసి శోధించవచ్చు. దీనికి బదులుగా ఐఆర్డీఏఐ వారి 'బీమా భరోసా' పోర్టల్‌ను సందర్శిస్తే, అన్ని బీమా సంస్థల అన్క్లెయిమ్డ్ అమౌంట్ సెర్చ్ పేజీల లింకులు అక్కడే లభిస్తాయి. డబ్బు ఉన్నట్లు తేలితే, కేవైసీ పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించి దాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.

**ఇబ్బందులు రా(లే)ని క్లెయిమ్ కోసం ఏం చేయాలి?..**

డబ్బు క్లెయిమ్ కాకుండా పోయిన తర్వాత తిరిగి పొందడం కంటే, అసలు ఆ పరిస్థితి రాకుండా చూసుకోవడం సులభమని నిపుణులు సూచిస్తున్నారు. పాలసీదారులు తాము తీసుకున్న ప్రతి పాలసీ గురించి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. నామినీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌తో పాటు.. మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ వంటివి మారినప్పుడు వెంటనే బీమా కంపెనీకి తెలియజేయాలి. అన్ని పాలసీ పత్రాలను ఒకేచోట భద్రపరచడం, పాన్, ఆధార్‌తో లింక్ చేయడం వల్ల నామినీలకు భవిష్యత్తులో పని సులభం అవుతుందని ఇన్సూరెన్స్ కంపెనీలు చెప్తున్నాయి. అయితే, క్లెయిమ్ కానీ, నిధులు..

దాదాపు రూ.9,000 కోట్లు ఇంకా క్లెయిమ్ కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, పాలసీదారులు కొన్ని నిమిషాలు కేటాయించి తమ పాత పాలసీలను సమీక్షించుకోవడం, ఆ వివరాలను కుటుంబ సభ్యులకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని చెప్తున్నారు. వారికి సమాచారం ఇ(తెలి)స్తే?.. ఇది వారి ఆత్మీయులకు చెందాల్సిన డబ్బు వృథా కాకుండా కాపాడుతుందని బీమా సంస్థలు సైతం ముందు నుంచి చెప్తూ వస్తున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి



**సూర్యాపేట జూన్ 29 (మనం ప్రతినిధి):** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో ప్రజల నుండి న ఫిర్యాదు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ... వానాకాలం వన మహోత్సవమునకు శాఖల వారీగా టార్గెట్స్ పూర్తి చేయాలని ప్రతి శాఖల అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు ప్రత్యేక దృష్టితో శాఖల వారీగా అధికారులు పూర్తిచేయాలని , ప్రజా పాలన - కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వాడకం పై అవగాహన కల్పించడంలో మహిళా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ బాగా కృషి చేశారని వారికి ధన్యవాదాలు తెలియజేశారు.ప్రతి కాలేజీ, స్కూళ్లలో డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అలాగే రోడ్డు భద్రత గురించి సంక్షేమ హాస్టల్స్ లో, కాలేజీ, పాఠశాలలో అవగాహన సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు రోడ్డు భద్రతపై సూచనలు చేయాలని, ఎన్ హెచ్ 65, కూడ కూడ రోడ్డులో అక్కడక్కడ రోడ్డు పాడైపోయి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నందువలన ఎన్ హెచ్ -65 అధికారులు, మున్సిపల్ ఇంజనీర్ సిబ్బంది సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. నేటి ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 53 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 9, డిఇఓ 5, డీపీఓ 3, మిగిలిన 28 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు.ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డి ఆర్ ఓ ప్రేమ్ రాజు, డిఆర్డిఓ పి డి సన్యాసయ, జడ్పీ సీఈఓ శిరీష, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్,డిఇఓ అశోక్ , సి పి ఓ కిషన్ నాయక్ ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

## దివ్యాంగులకు మెరుగైన సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 29 (మనం ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని యాదగిరిగుట్ట మండలంలో ఉన్న దివ్యాంగుల పునరావాస కేంద్రానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టి సౌజన్యంతో ప్రత్యేకంగా అందించిన ఆటో వాహనాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు మెరుగైన సేవలు అందించడంలో ఈ ఆటో వాహనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వారి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ( డి ఆర్ డి ఓ), అదనపు డీఆర్డీఓ , డి పి ఎం యు డి పి ఎం ఎస్, ఏ పి ఎం జిల్లా సమాఖ్య ఓబీ సభ్యులు, ఏపీఎంలు, ఎం ఎస్ సి సి కార్యకలాపాల సిబ్బంది, ఆయాలు, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమక్షంలో షష్టిపూర్తి మహోత్సవం



**చిలుకూరు, జూన్ 29 (మనంన్యూస్):** మండల పరిధిలోని ఆచార్యుల గూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు వారి కప్పగించిన పనిని పూర్తి చేసి అదే గ్రూపులో 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పుణ్య దంపతులు బేరి తిరుపతయ్య లక్ష్మీ ఈశ్వరమ్మలు ఉన్నారని తెలుసుకున్న గ్రూప్ సభ్యులు వారికి పూలదండలు శాలువాలు తెప్పించి ఒకరి చేత మరొకరికి మార్పించి శాలువాలతో సత్కరించి వారు ఆప్యాయంగా బంధుమిత్రులై కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ బంధుమిత్రులు లేకున్నా వారే అన్నిఐ షష్టి పూర్తి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు చాలా సంతోషంగా ఉందని వారు ఆనందాన్ని వెలి బుచ్చారు. కార్యక్రమంలో ఫీల్ అసిస్టెంట్ శంకర్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి, జూన్ 29 (మనం ప్రతినిధి):** వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 69అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

అందులో రెవిన్యూ శాఖ 31, జిల్లా గ్రామీణాభివృది 7., సర్వే ల్యాండ్ 6, మున్సిపాలిటీ 6, వ్యవసాయ 4, సంక్షేమ శాఖ 3, ,ఆర్టీసీ 2, జిల్లా పరిషత్ 2, చేనేత , కోపరేట్యీవ్, సమాచార శాఖ, విద్య, బి.సి వెల్ఫర్, హౌసింగ్, వైద్య ఆరోగ్య, పంచాయతీ,శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో , సిఈ ఓ జెడ్పి సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డి. ఆర్.ఓ జయమ్మ, పిడి హౌసింగ్ అలివేలు , ఆర్డీవో కృష్ణారెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జులై 1న దేశవ్యాప్త నిరసనను విజయవంతం చేయండి




**సూర్యాపేట, జూన్ 29, మనం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదల జీవనోపాధికి ఆధారమైన ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేలా తీసుకున్న చర్యలను వెంటనే విరమించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఆయా సంఘాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడుతూ..... గ్రామీణ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న వి బి జి రాంజీ బిల్లును తక్షణమే రద్దు చేయాలన్నారు. కోట్లాది నిరుపేద కుటుంబాలకు ఉపాధి, ఆదాయ భరోసా కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని అమలు పరచడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పని దినాలను తగ్గించడం, నిధుల విడుదలలో జాప్యం, కూలీలకు వేతనాలు సైతం ఆలస్యంగా చెల్లించడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో వి బి జి రాంజీ బిల్లు అమల్లోకి వస్తే గ్రామీణ ఉపాధి వ్యవస్థ మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని, పేదలు, వ్యవసాయ కార్మికులు, చిన్న రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. రేపు (జులై 1 న) దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లె వెంకట్ రెడ్డి వ్యవహరించారు. సిఐటియు జిల్లా నాయకులు శీలం శీను, వట్టపు సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పులుసు సత్యం, పోసనబోయిన హుస్సేన్, జంపాల స్వరాజ్యం, సోమపంగా జానయ్య, కడెం కుమార్, గుంజ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు నాయకులు మిట్ట గడుపుల ముత్యాలు, రణపంగా కృష్ణ, వల్లపు దాసు సాయికుమార్, శివకృష్ణ, దశరథ, మామిడి సుందరయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, దేవరకొండ యాదగిరి, ఇరుగు రమేష్, బుడిగె ధనుంజయ్ గౌడ్, బచ్చల కూర స్వరాజ్యం, యాతాకుల వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

## ప్రజావాణి బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**సూర్యాపేట, జూన్ 29 (మనం ప్రతినిధి):** ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న బాధితుల సమస్యలు వెంటనే పరిష్కారం చూపే విధంగా చేయాలని జిల్లా ఎస్పీ కే నరసింహ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పీని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎనిమిది మంది ఏఆర్ కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్స్ గా ఉద్యోగోన్నతి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఏఆర్ కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్గా పదోన్నతులు పొందారు. ఇందులో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ కే నరసింహ స్వయంగా పదోన్నతులు పొందిన హెడ్ కానిస్టేబుల్ లకు ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి మిఠాయి పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసులకు పదోన్నతి విదుర పట్ల మరింత బాధ్యతను పెంచుతుందని ఇది నిర్వహణలో ప్రజల మన్ననలను పొందాలని సిబ్బందికి సూచించారు. పదోన్నతి పొందిన వారిలో ఆర్మడ్ రిజర్వ్ నందు కానిస్టేబుల్స్ గా పని చేస్తున్న నంద కిషోర్, నాగరాజు, షేక్ రఫీ, రమేష్, కె సతీష్, ఎం సతీశ్, క్రాంతి, రవి నాయక్ లు ఉన్నారు.ఎస్పీ వెంట ఆర్.ఐ జానయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇడమయ్యను నడిపిస్తాను

### కృత్రిమ కాల్లు పెట్టించేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థ

### ఇడమయ్య ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చిన నిర్వాహకుడు

### దుస్తులు, నగదు అందజేత

### 'మనం' కధనానికి స్పందన







**చర్ల, జూన్ 29 (మనం న్యూస్) :** ఆరేళ్ల క్రితం విద్యుత్ ఘాతంతో ప్రమాద వసాత్తూ రెండు కాల్లు పూర్తిగా, రెండు చేతులను పాక్షికంగా కోల్పోయి దుర్భర జీవితం అనుభవిస్తున్న చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామానికి చెందిన ఆదివాసీ మడకం ఇడమయ్యను ఆదుకునేందుకు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు తోలెం శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. కాల్లు, చేతులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న ఇడమయ్య దీనగాధపై ఈ నెల 20 వ తేదీన 'మనం' దినపత్రికలో ప్రచురితమైన 'పాపం ఇడమయ్య' కథనానికి పినపాక మండలం సింగిరెడ్డిపల్లి పంచాయతీ దేవానగరం గ్రామానికి చెందిన మహర్షి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తోలెం శ్రీనివాసరావు స్పందించారు. సోమవారం ఆయన బక్కచింతలపాడు గ్రామాన్ని సందర్శించి ఇడమయ్య తో మాట్లాడారు. దెబ్బతిన్న అవయవాలను పరిశీలించి నడిపించే బాద్యతనదేనంటూ భరోసా ఇచ్చారు. సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో రెండు కృత్రిమ కాల్లను పెట్టిస్తానని తెలిపారు. త్వరలో ఇడమయ్యను విజయవాడ తీసుకువెల్లి కృత్రిమ కాల్ల కొలతలను తీయించి నెల రోజులలో ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. పూర్తిగా దెబ్బతిన్న కుడి చేతికి సైతం వైద్యుని సూచనతో రాడ్డు వేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. తమ సంస్ద ద్వారా ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ప్రమాదాలలో కాల్లు కోల్పోయిన 20 మందికి సంస్ద ద్వారా కృత్రిమ కాల్లను అమర్చినట్లు వెల్లడించారు. ఇడమయ్యకు బ్యాటరీ సైకిల్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇడమయ్యకు నూతన దుస్తులు, నగదును అందచేసి మానవత్వం చాటుకున్నారు. ఇడమయ్య ధీనగాదను బాహ్యప్రపంచానికి తెలియ చేసిన 'మనం'ను అబినందించారు. కార్యక్రమంలో కలివేటి పవన్ కుమార్, పాయం నాగబాబు, స్దానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి



**యాదాద్రి భువనగిరి, జూన్ 29 (మనం ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. గతంలో మూతపడిన భువనగిరి మండలం లోని బాలంపల్లి ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉండే ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందు వలన అందరు తమ పిల్లలను పంపించాలని ఆయన కోరారు. సోమవారం తిరిగి ప్రారంభించిన పాఠశాలకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మొదలైన అన్ని సదుపాయాలను, ఉపాధ్యాయులను వెంటనే సర్దుబాటు చేయాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. పాఠశాల తిరిగి ప్రారంభం కావడానికి పూనుకున్న గ్రామ సర్పంచ్ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదనీ, ప్రైవేటు పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి,ఉపసర్పంచ్ కృష్ణ,మండల విద్యాధికారి ఆర్.రంగరాజన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్.అండాలు,ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు,సి.ఆర్పి.అన్నపూర్ణ,అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి



**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 29 (మనం ప్రతినిధి):** కేజీబీవీ పాఠశాలలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి , మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని విద్యార్థులకు కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ( కేజీబీవీ) సెక్టోరియాల్ ఆఫీసర్స్ తో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,జిల్లా విద్య శాఖ అధికారి బిక్షపతి తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్... పాఠశాలల్లో ఇంకా పూర్తికాని పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పెండింగ్లో ఉన్న నిర్మాణ, మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి రుచికరమైన ఆహారం అందించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కాంపౌండ్ వాల్స్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల పరిధిలో వీధి కుక్కలను లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పనులలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరి ంచారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, జూన్ 29(మనంన్యూస్):** సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజలనుండి వినతులు స్వీకరించడమైనది. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజలు పెద్ద సంఖ్య లో పాల్గొని వినతులను జిల్లా కలెక్టర్ స్వయంగా స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ వెంటనే పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 249 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 82, మున్సిపాలిటీకి 65, హౌసింగ్ శాఖకు 31, ఇతర శాఖలకు సంబంధించి 71 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ ప్రకాష్, డి ఎస్ డి ఓ భాగ్యలక్ష్మి, సంబంధిత జిల్లా అధికారులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా అధికారుల కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ భాస్కరరావు




**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 29 (మనం ప్రతినిధి):** జిల్లాలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఇందిరమ్మ గృహాల నిర్మాణ పురోగతి, ఉపాధి హామీ పనుల మంజూరీ మరియు భౌతిక పురోగతి, విలేజ్ ఆర్గనైజేషన్ అసోసియేషన్ ( వివో ఏ) భవనాల నిర్మాణం, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గుంతల తవ్వకం, మొక్కల నాటకం, స్వచ్ఛ భారత్ మిషన్ కింద డ్రెయిన్ ఎండ్ సోక్ పిట్స్, వ్యక్తిగత మరుగుదొడ్ల ( ఐ హెచ్ హెచ్ ఎల్) చెల్లింపులు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ( ఎన్ ఎఫ్ బి ఎస్), పి ఎం కె ఎస్ వై 2.0 తదితర అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ శాఖల వారీగా పురోగతిని పరిశీలిస్తూ, ప్రతి కార్యక్రమంలో లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ జూలై 1 నుండి ప్రారంభమయ్యే వీబీజీ రామ్ జి (వి బి జి ఆర్ ఏ ఎం) కార్యక్రమానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవలు ప్రజలకు సకాలంలో, సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు, ఎంఎస్వోలు, డిప్యూటీ ఈఈలు, ఎంపీడీవోలు, ఏఈఈ (పంచాయతీరాజ్), డీఎల్పీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, హౌసింగ్ శాఖ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- **డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దాం**




**ములుగు, జూన్ 29, మనం ప్రతినిధి :** ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా కేంద్రంలోని ములుగు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుండి కలెక్టరేట్ వరకు 'అంతర్జాతీయ డ్రగ్స్ మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని' పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ మరియు వికలాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖలు సంయుక్తంగా 'మిషన్ పరివర్తన' ద్వారా సంయుక్తంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. జిల్లా సంక్షేమాధికారి ఏపీ ప్రేమలత అధ్యక్షతన జరిగినది . ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రాంనాథ్ కేకన్ గార్లు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలనుండి విచ్చేసిన సుమారు 500 మంది విద్యార్థులు, యువకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది. జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం లో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత అధ్యక్షతన నషా ముక్త్ భారత్ అభియాన్ పరిధిలో భాగంగా నిర్వహిస్తున్న 'మిషన్ పరివర్తన వారోత్సవాల' ముగింపు లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముందుగా జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఉ్క ప్రేమలత మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా 'మిషన్ పరివర్తన' ప్రత్యేక కార్యక్రమాన్ని పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత, సంక్షేమ శాఖ ద్వారా వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ కార్యక్రమాలను గూర్చి వివరించారు. డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణంలో భాగంగా అందరినీ ఈ అవగాహన కార్యక్రమాల్లో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించడం ద్వారా కార్యోన్ముఖులను చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత్ సహదేవరావు బోర్కడే ఐఎఖ మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్తు అని, మీ తల్లి తండ్రులు మీ పై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నారని, ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి కుటుంబానికి, ఈ దేశానికి గొప్ప ఆస్తిగా ఎదగాలని సూచించారు. చదువుతున్న యువతలో వారు స్వతహాగా మంచి ఆలోచనతో ఉన్నా కూడా చుట్టూ ఉన్న సహచరుల ప్రభావం వల్ల కూడా చాలా మంది సిగరెట్, గంజాయి వంటి డ్రగ్స్ కి అలవాటు అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఒకసారి డ్రగ్స్ కి అలవాటు అయితే వాటి నుండి దూరం కావడం చాలా కష్టం, సమాజం కూడా ఇలాంటి వారిని చిన్న చూపు చూస్తుందని, ఇలా డ్రగ్స్ కి బానిస అయిన వారిని బయటకు తీసుకు రావడానికి కేవలం కౌన్సిలింగ్ అనే ఒక మార్గం మాత్రమే ఉందని, ఎవరికైనా అలాంటి పరిస్థితుల్లో గుర్తిస్తే ఖీఎఅూఆ, నషా ముక్త్ భారత్ అభియాన్ విభాగాలను సంప్రదించాలని అన్నారు. ఒక అందమైన జీవితం మీ కోసం ఎదురుచూస్తుంది దానిని సాధించడం కోసం ప్రయత్నించాలని సూచించారు. మన రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం కోసం తెలంగాణ ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తుందని, దీనిని విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు డీస్పీ , ఈగల్ టీమ్ సీఐ , ములుగు సీఐ , ప్రజా ప్రతినిధులు , నాశ ముక్త్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ఊఖ్ణ గణేష్ ,డీసీపీ ఒ. ఓంకార్, ృఏఉగి ృఖ రమాదేవి, సఖి ఇఅ లావణ్య,, ఇఏఔ కోఆర్డినేటర్ నరేష్, ఇఉ్ప. అనూష, ృఝ్క, ఇఏఔ, సఖి, ృఏఉగి తదితర విభాగాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోపు గణన ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

- **తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి**




**ములుగు, జూన్ 29, మనం ప్రతినిధిః** ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా గణన ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి, ఐఏఎస్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి, ఐఏఎస్, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, గణన ఫారాలను బూత్ స్థాయి అధికారులు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో గణన ఫారాలను పంపిణీ చేయకూడదని తెలిపారు బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి గణన ఫారాలను పంపిణీ చేయాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. గణన ఫారాన్ని సమర్పించిన ఓటర్ల వివరాలు మాత్రమే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగించబడతాయని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోపు ఇంటింటికీ వెళ్లి గణన ఫారాల పంపిణీని పూర్తి చేయడంతో పాటు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి, సహాయ ఎన్నికల నమోదు అధికారి తహసీల్దార్ విజయభాస్కర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అర్హుడైన ఓటరు కూడా మిస్ కాకూడదు



- **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు**

**మహాదేవపూర్ జూన్ 29మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ఈరోజుసోమవారంరోజునస్వయంగా పరిశీలించారు.బి ఎల్ ఓలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబుమాట్లాడుతూఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు ఒక్క అర్హుడైనఓటరు కూడాఓటరు జాబితా నుంచి మిస్ కాకుండాప్రతిఇంటినిక్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుంది ప్రతి కుటుంబం తమ ఓటరువివరాలను బిఎల్ఓ లకుసహకరించి, ధృవీకరించాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి ప్రతి ఓటులోనే ఉంది. ఓటరు జాబితాలోప్రతిఅర్హుడిపేరు ఉండేలా అధికారులు, బిఎల్ఓలు అత్యంత బాధ్యతతోపనిచేయాలి. ఎలాంటి పొరపాట్లకు లేకుండా ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసిఒక్క ఓటు కూడామిస్ కాకుండా చూడడమే మనందరి లక్ష్యంఅనిఅన్నారు. అనంతరంజిల్లా గ్రంథాలయ చైర్మన్ కోటరాజబాబు బి ఎల్ ఓ ల పనితీరును స్వయంగా పరిశీలించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా, ఎలాంటి లోపాలకు తావు లేకుండా పూర్తి చేయాలని అధికారులకుఆదేశించారు.అలాగే ప్రజలుకూడా పూర్తిస్థాయిలోసహకరించిప్రతిఅర్హుడి పేరుఓటరు జాబితాలోఉండేలాఒక్క ఓటు కూడా మిస్ కాకుండా అందరం కలిసిపనిచేద్దాం అనిపిలుపునిచ్చారు. ఈకార్యక్రమం లోకాంగ్రెస్ పార్టీ సీనియర్నాయకులు కటకంఅశోక్,బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు అన్సార్ ,ఆకుతోట సుధాకర్, సంతోష్,బి ఎల్ ఓ మరియు ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆర్థిక సహాయం

**గుండారపు నర్సయ్య,సిలివేరు భద్రయ్య కుటుంబాలకు చెరొక ఐదు వేల రూపాయల చొప్పున అంద జేత**

**ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పాల్లే కాపాడుకుంటాం-బాడిశ నాగ రమేష్**



**మంగపేట, ఏప్రిల్ 29, మనం ప్రతినిధిః** మంగపేట మండలం మల్లూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కి చెందిన గుండారపు నర్సయ్య మరియు సిలివేరు భద్రయ్య అనే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఇటీవల అనారోగ్యం తో మరణించారు.వారి కుటుంబాన్ని సోమవారం నాడు బిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్ స్థానిక మల్లూరు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించారు.స్థానిక నాయకులు సేకరించిన డబ్బులను గుండారపు నర్సయ్య కుటుంబానికి ఐదు వేలు రూపాయలు మరియు సిలివేరు భద్రయ్య కుటుంబానికి ఐదు వేల రూపాయల చొప్పున బాడిశ నాగ రమేష్ చేతుల మీదుగా అందజేశారు.అనంతరం నాగరమేష్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎంత కష్టం వచ్చినా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లూరు గ్రామకమిటీ అధ్యక్షుడు సోయం ఈశ్వర్,మండల నాయకులు పుజరి శ్రీనివాస్,చక్రధర్ స్థానిక నాయకులు చిట్యాల శ్రీను,చిరంజీవి,జంపయ్య,అలీం పాషా, రాంబాబు, నాగరాజు, విశ్వనాధం ,నరసమ్మ ,తాటి లింగయ్య,నరసింహారావు,నాగేష్ ,హరినాథ్ ,గౌరీశంకర్,మురళి,మునిగేల మహేష్,మండల సంతోష్,అకినేపల్లి మల్లారం గ్రామ కమిటీ అధ్యక్షులు రూప భద్రయ్య,తిమ్మాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమరం పుల్లారావు మరియు సోషియల్ మీడియా వారియర్ సభ్యులు మునిగేల నరేష్ తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ జాబితా సవరణపై ప్రజలకు అవగాహన



**మహాదేవపూర్ జూన్ 29మనం న్యూస్:** మహాదేవపూర్ మండలం బెగుళూరు గ్రామంలో ఓటర్ జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటకం అశోక్ మాట్లాడుతూ ఓటుహక్కుప్రతిపౌరుడిరాజ్యాంగబద్ధమైన హక్కు ,ప్రజాస్వామ్య బలోపేతం చేయడంలో ప్రతి ఓటు ఎంతో విలువైనది అని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రతి కుటుంబం పూర్తి సహకారం అందించి ఓటర్ జాబితాలో తమపేరుచిరునావావ యసు తదితరవివరాలు సరిచూసుకుని అవసరమైన మార్పులు చేర్పులుతొ లగింపులుచేయించుకోవాలని వారుసూచించారు. ఈకార్యక్రమంలో బి ఎల్ ఓ జల్లారపు సుజాత గ్రామ సర్పంచ్ ఆకుల రాజయ్య ఉప సర్పంచ్ సదానంద చారివమాజీ జెడ్పిటిసి సభ్యులు గుడాల అరుణ శ్రీనివాస్ మండల అధికార ప్రతినిధి బుర్రి శివరాజు మరియు నాయకులు ప్రజలుతదితరులు పాల్గొన్నారు

# బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలి

**వైద్యులకు సూచించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు**



**ఏటూరు నాగారం, జూన్ 28, మనం ప్రతినిధిః** మంత్రి సీతక్క ఆదేశాల మేరకు,జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు.ఏటూరునాగారం మండలం శివాపూర్ గ్రామానికి చెందిన గద్ద రఘుపతి పొలంలో పని చేస్తూ గండ్లు వేస్తున్న క్రమంలో అనుకోకుండా పాము కాటుకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రి కు తరలించారు... ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అనంతరం వైద్యులను సంప్రదించి రఘుపతికి మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేల వినయ్ కుమార్,పిఏసిఎస్ డైరెక్టర్ వంగపల్లి రవి,వార్డు నెంబర్ ముమ్మనేని రమేష్,గంపల శివకుమార్, బి భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాశీ విశ్వనాధ రెడ్డి 40వ వర్ధంతి

- **బలమైన పునాదులే ఆధునిక సేవ కుకారణం**
- **సభ్యుల ఐకమత్యమే సంఘం అభివృద్ధి**
- **అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి**



**భీమదేవరపల్లి జూన్ 29 మనం న్యూస్:** భారతదేశంలోని ప్రసిద్ధిగాంచిన సహకార బ్యాంక్ వ్యవస్థాపద్యక్షులు కాశీ విశ్వనాధ రెడ్డి 40 వ వర్ధంతి సభ్యులు ఘనంగా నిర్వహించారు. సోమవారం రోజున ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ప్రధాన కార్యాలయ ఆవరణలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు ఏకే విశ్వనాథరెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం సీనియర్ సభ్యుడైన వంగర గ్రామానికి చెందిన రంగనాయకుల బాల్ రెడ్డి, ముల్కనూర్ గ్రామానికి చెందిన దొంగల ఐలయ్య విశ్వనాథరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షులు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఆత్మకు శాంతి చేకూరాలని సభ్యులతో పాటు రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం వారు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి సంఘానికి వేసిన బలమైన పునాదులపైనే ఆధునిక సేవలు సభ్యులకు మరింత సమర్థవంతంగా సేవలు అందజేస్తున్నామని అన్నారు. సంఘం అభివృద్ధి కోసం సభ్యులు ఐకమత్యంతో కట్టుబడి ఉండడం వల్ల సంఘం శ్రేయస్సు కు కట్టుబడి ఉండాలని సభ్యులకు పిలుపునిచ్చారు. సంఘం ప్రారంభ దశ నుంచే రైతులకు అందించిన వ్యవసాయ రుణాల కారణంగానే బహిరంగబావుల సంఖ్య ఏర్పడడానికి కారణం అని, రైతుల ఆదాయం పెరగడంతో వ్యవసాయ అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులకు సంఘం ద్వారా వినూత్నమైన సేవలను పారదర్శకతను, పరిశీలించేందుకు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు సంఘాన్ని సందర్శించడం సంఘానికి దక్కిన విశిష్ట గుర్తింపు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ మేనేజర్ మారుపాటి రామిరెడ్డి, ఉపాధ్యక్షులు గజ్జి వీరయ్య, కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


# నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో మందు



- **హెల్త్ అసిస్టెంట్ షేక్ హాలీమా**

**మంగపేట, జూన్ 29,మనం ప్రతినిధిః** మంగపేట మండలం మల్లూరు గ్రామపంచాయతీ భవనంలో చిన్నారు ల ఆరోగ్య సంరక్షణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో గ్రామంలో ఉండబడిన 0 నుండి 5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం జరిగిందని హెల్త్ అసిస్టెంట్ షేక్ హాలీమా తెలిపారు.100% పూర్తి గా గ్రామంలోని పిల్లలందరూ హాజరయ్యారని వారందరికీ వారి వారి తల్లిదండ్రుల సమక్షంలో పోలియో చుక్కల విశిష్టతను వివరించామని నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో మందును వేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం సీతమ్మ స్థానిక ఆశా వర్కర్లు ఏ సాంబలక్ష్మి టి యజ్ఞమ్మ కె వజ్రమ్మ , చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కన్నాయిగూడెంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**కన్నాయిగూడెం, జూన్ 29, మనం న్యూస్ః** కన్నాయిగూడెం,మనం మండల రైతు వేదికలో సోమవారం రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్లు కలిసి పంపిణీ చేశారు. ఈ పంపిణీలో భాగంగా గుర్రవుల గ్రామానికి చెందిన పటేల్ స్వప్నకు రూ.25,200, బుట్టాయిగూడెంకు చెందిన జాడి భాను దుర్గ హర్షన్కు రెండు చెక్కుల ద్వారా రూ.13,000, రూ.5,500, కొత్తూరుకు చెందిన కుమ్మరి సమతకు రూ.32,500, అలాగే దేవాదుల గ్రామానికి చెందిన బొల్లె రంజిత్కు రూ.15,000విలువైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఆపద కాలంలో ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయం పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కరెక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండ్ అప్సర్ పాషా జాడి రాంబాబు నగేష్ సర్పంచ్ లక్ష్మయ్య ప్రజా ప్రతినిధులు పాలుగోన్నారు

# ఎన్యూమరేషన్ సర్వేను పరిశీలించిన కలెక్టర్




**వరంగల్, జూన్ 29(మనంన్యూస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరేపల్లిలో నిర్వహిస్తున్న ఇంటింటి ఎన్యూమరేషన్ సర్వేను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు చేపడుతున్న ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వివరాలను ఖచ్చితంగా నమోదుప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) చేయాలని బిఎల్ఓను ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం వర్ధన్నపేట నియోజక వర్గం లోని తిమ్మాపూర్ రోడ్డు లక్ష్మీపూర్, రంగసాయిపేటలోని రాంగోపాల్ పురంలో నిర్వహిస్తున్న ఇంటింటి ఎన్యూమరేషన్ సర్వేను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) పరిశీలనలో వరంగల్ ఆర్డీవో సుమ ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఘనంగా లక్ష్మీ దేవర బోనాల జాతర



**మహాదేవపూర్ జూన్ 29మనం న్యూస్:** మహాదేవపూర్ మండలం కేంద్రంలోనిమల్లన్న బోనాల జాతర లో భాగంగా సోమవారం రోజున లక్ష్మీదేవి దేవర బోనాల్లో సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ దర్శించుకున్నారు. మండలంలోని లక్ష్మీ దేవరబోనాల జాతరలో భాగంగా ముందు రోజు ఆదివారం రోజున గోదావరి స్థానాలు అలంకరిస్తారుమొదటిరోజుమొక్కులుతీర్చుకొనిమర ఎసటి రోజు సోమవారం రోజున బోనం పోసి భక్తులు లక్ష్మీదేవరనుదర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి రెండో రోజు సాధారణ భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. లక్ష్మీ దేవరను దర్శించు కోవడం జరిగింది,ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ వార్డ్ సభ్యులు గడ్డం స్వామి నల్ల బుగ్గ సమ్మ య్య, చీర్లవంచ చంద్రశేఖర్, అడప మానస,లావణ్య కొండపల్లి రాముడు,మాజీ ఆకుతోట ఎంపిటిసిఆకుతోట సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వివో భవనానికి భూమి పూజ



**భీమదేవరపల్లి జూన్ 29 మనం న్యూస్:** భీమదేవరపల్లి లో గ్రామ సమైక్య భవనానికి గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి భూమి పూజ చేశారు. సోమవారం రోజున మండల కేంద్రంలో ఎంపీడీవో వీరేశం ఆధ్వర్యంలో గ్రామ సమాఖ్య భవనానికి భీమదేవరపల్లి గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి భూమి పూజ చేసి టెంకాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో మండల పరిధిలోని మహిళా సంఘ సభ్యులు, సంఘ అధ్యక్షులు, వివో లు సి ఏ లు వివిధ ఆర్థిక లావాదేవీలపై, మహిళలఆర్థిక అభివృద్ధి వివిధ శిక్షణ తరగతుల ద్వారా మహిళలకు అందించేందుకు వివో భవనాన్ని ఏర్పాటు చేయడం 10 లక్షల నిధులతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వేలు, ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, సిసి అశోక్, వార్డు సభ్యులు సంధ్య, లలిత విజయ ,అశోక్, రెడ్డి ,వెంకటేశ్వర్లు ,శ్యామ్, కార్యదర్శి మోహన్, సిఏలు కవిత ,రాణి ,లక్ష్మీ ,శ్వేత, శారద ,విమల, శ్రీనివాస్ ,కరుణాకర్లు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి.**

**ములుగు, జూన్ 29, మనం ప్రతినిధిః** ప్రజావాణిలో ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 81 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 18,పెన్షన్ లకు 09, భూ సమస్యలు 26 ఇతర శాఖలకు సంబంధించినవి 28 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి,డిఆర్ఓ రవి కుమార్,అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు..



# ‘విశ్వనాథ్ అండ్ సన్స్’.. పాట పాడిన సూర్య

ప్రస్తుతం ‘కరుప్పు’ సినిమా భారీ విజయంతో ఫుల్ జోష్ లో ఉన్నారు హీరో సూర్య. అదే ఉత్సాహంతో తన కొత్త సినిమా గురించి అదిరిపోయే అప్ డేట్ ఇచ్చారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య హీరోగా నటిస్తున్న చిత్రం ‘విశ్వనాథ్ అండ్ సన్స్’. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ సినిమాలో సూర్య అభిమానులకు ఓ స్పెషల్ ట్రీట్ ఇవ్వనున్నారు. 2014లో వచ్చిన ‘అంజాన్’ మూవీలో ‘ఏక్ దో తీన్’ పాట పాడిన సూర్య.. మళ్లీ ఇన్నాళ్లకు ఈ సినిమా కోసం గొంతు సవరించుకున్నారు. ఇందులో సూర్య స్వయంగా ఓ పాట పాడారు. ఇదొక పూర్తి స్థాయి హుషారైన డ్యాన్స్ నంబర్ అని తెలుస్తోంది. ఈ పాటకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం ఇవ్వగా.. కెన్ కరుణాస్ లిరిక్స్ అందించారు. ఈ విషయాన్ని జీవీ ప్రకాష్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సూర్య పాడిన ఈ పాట సినిమాకే హైలైట్ గా నిలవనుంది. ఇటీవల ఈ సినిమాలోని ‘నేనో బటర్ఫ్లై’ పాటకు మంచి స్పందన వచ్చింది.

ఇక ఈ చిత్రంలో సూర్య సరసన మమితా బైజు హీరోయిన్ గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్, సీనియర్ నటి రాధిక శరత్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

# భారత క్రికెట్‌కు ‘బ్లాక్ సండే’..

ప్రపంచ క్రికెట్ లో అటు సంపాదనలోనైనా.. ఇటు ఆటలోనైనా టీమ్ఇండియాకు తిరుగులేదనేది కాదనలేని వాస్తవం. కానీ, ఈ ఆదివారం భారత క్రికెట్ చరిత్రలో మాయని మచ్చగా మారిపోయింది. ఇటు పురుషుల క్రికెట్ తోపాటు మహిళల విభాగంలోనూ ఘోర పరాభవం ఎదురైంది. అంతా సండేను జోష్ డే అంటారు.. కానీ మనకు మాత్రం ‘బ్లాక్ డే’ అయిందంటూ క్రీడాభిమానులు విమర్శిస్తున్నారు.

**అతివిశ్వాసమేనా?**

ఐర్లాండ్ అంటే మన దృష్టిలో పసికూనే. సీనియర్లు గాయాల కారణంగా దూరం కావడంతో మన కుర్రాళ్లు దంచేస్తారులే అని అంతా భావించారు. తీరా, తొలి మ్యాచ్ లోనే టీమ్ఇండియాకు ఐర్లాండ్ షాక్ ఇచ్చింది. సర్లే.. అక్కడి పిచ్, వాతావరణానికి మనోళ్లు కాస్త అలవాటు పడేందుకు సమయం కావాలి కదా.. అని భావించారు.





అసలైన పరీక్ష రెండో టీ20లో ఎదురైంది. 150+ పరుగుల లక్ష్యాన్ని సాధించడంలోనూ టీమ్ఇండియా విఫలం కావడం తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. మొదటి టీ20లో 180+ ఉంది కదా.. పిచ్ కూడా మన దగ్గర ఉన్నట్లు లేదుగా ఓడిపోయారని సర్దిచెప్పుకొన్నాం. తీరా, రెండో మ్యాచ్ లో ఒక్క పరుగు తేడాతో ఓడిపోయాం. తిలక్ వర్మతోపాటు ఆఖర్లో హర్షిత్ రాణా దూకుడుగా ఆడాడు కాబట్టి.. ఘోర ఓటమి నుంచి బయటపడ్డాం. టాప్ ఆర్డర్ పెవిలియన్ కు చేరగానే మన పరాజయం ముందే డిసైడ్ అయిపోయింది. భారత మూలాలు కలిగిన ఐర్లాండ్ పేసర్ మూంద్రాకు వికెట్లు సమర్పించడం గమనార్హం.

ఐర్లాండ్ను తక్కువగా అంచనా వేసి బరిలోకి దిగామని మాజీలే విమర్శించారు. త్వరగా రెండు మూడు వికెట్లు తీయగానే మన బౌలర్లు రిలాక్స్ అయిపోయారు. అదే అదనుగా ఐర్లాండ్ బ్యాటర్లు దూకుడు ప్రదర్శించి మెరుగైన స్కోర్లను సాధించారు.

మొదటి టీ20లో సంజు శాంసన్, ఇషాన్ కిషన్ విఫలమైనా సరే.. మళ్లీ అవకాశం ఇచ్చారు. ఈసారి వారిద్దరితోపాటు అభిషేక్ కూడా త్వరగా డగౌట్ కు చేరాడు. అటు కొత్తగా అరంగేట్రం చేసిన సూర్యాంశ్ షెడ్జే ఏమైనా ప్రభావం చూపించాడా? అంటే అదీ లేదు. అతడి బదులు వైభవ్ సూర్యవంశీని తీసుకున్నా సరిపోయేది కదా అనే ప్రశ్నలు ఇప్పుడు మేనేజ్ మెంట్ ముందున్నాయి.

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ లో బ్యాటర్ గా అదరగొట్టాడు. సారథిగానూ పంజాబ్ కింగ్స్ ను అద్భుతంగా నడిపించాడు. సూర్యకుమార్ స్థానంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శ్రేయస్ కు కెప్టెన్సీ దక్కింది. కానీ, తొలి సిరీస్ ను కోల్పోవడంతో పాపం అతడి ఫేట్ ఇలా ఉందేమిటి అంటూ ఫ్యాన్స్ కూడా బాధపడ్డారు.

కనీసం బ్యాటర్ గానైనా సమయోచిత ఇన్నింగ్స్ ఆడితే బాగుండేదని పలువురి సూచన. పంజాబ్ తరఫున చాలాసార్లు క్రీజ్ లో నిలబడి మ్యాచ్ లను గెలిపించాడు. లేకపోతే శ్రేయస్ కూ సూర్య పరిస్థితి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ ఓటముల నుంచి నేర్చుకుని ముందుకు సాగుతారా? లేదా? అనేది ప్లేయర్ల చేతుల్లోనే ఉంది.

ఐర్లాండ్ తో సిరీస్ అంటే సరేలే.. పిచ్లు మనకు తెలియదు కదా అని వదిలేద్దాం. ఇంగ్లాండ్ తో జులై 1 నుంచి ఐదు టీ20ల సిరీస్ ప్రారంభమవుతుంది. వైభవ్ కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. ఇంగ్లాండ్ లో గతంలో ఆడిన అనుభం కొందరికి ఉంది. ఇక్కడా ఓడితే మాత్రం అటు ప్రధాన కోచ్ గంభీర్తోపాటు శ్రేయస్ పదవులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

**ఫేవరెట్ గా బరిలోకి దిగి..**

పైన పురుషుల టీమ్ కోల్పోయింది సిరీస్ మాత్రమే. అయితే, ఐర్లాండ్ చేతిలో కావడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఇక మహిళల జట్టు ఆదివారం టీ20 ప్రపంచ కప్ లో ఆస్ట్రేలియాతో తలపడి ఓడి సెమీస్ కు చేరే అవకాశాన్ని చేజేతులా మిస్ చేసుకుంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన టీమ్ఇండియా గ్రూప్ స్టేజ్ నుంచే నిష్క్రమించడం అభిమానులకు రుచించడం లేదు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ పై గెలిచి.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో భారత్ మూడో స్థానానికి పడిపోయింది.

ఏ జట్టుకైనా మిడిలార్డర్ చాలా బలంగా ఉండాలి. పేపర్ పై టీమ్ఇండియా పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కానీ, కెప్టెన్ హర్మన్ ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్, యస్తికా భాటియాతో కూడిన బ్యాటింగ్ లైనప్ నిలకడ చూపించలేకపోయింది.

ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ మంచి ఆరంభాలను ఇస్తున్నా.. వాటిని భారీ స్కోర్లుగా చేయాల్సిన బాధ్యత మిగతా బ్యాటర్లపై ఉంది. ఆఖర్లో రిచా ఘోష్ దూకుడు ఆడటం మినహా.. మిగతా వారి నుంచి సరైన ప్రదర్శన రాలేదు.

స్థాయికి తగ్గట్టు ఆడలేకపోయామని భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ చెబుతున్నా.. ఆమె సారథ్యంపై వేటు వేయాలనే డిమాండ్లూ మొదలయ్యాయి. అయితే, ఆమె నాయకత్వంలోనే వన్డే ప్రపంచ కప్ ను భారత్ నెగ్గిందనే విషయాన్ని పలువురు ప్రస్తావించారు. కానీ, టీ20 జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం ఉందనేది మరికొందరి వాదన.

ఇప్పటికే 37 ఏళ్లు ఉన్న హర్మన్ ప్రీత్ కౌర్ ఆటకు గుడ్ బై చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇప్పుడీ ఓటమితో మరికొద్ది రోజుల్లో తన నిర్ణయాన్ని హర్మన్ ప్రకటించే అవకాశం లేకపోలేదు.



# ఐర్లాండ్‌కు భారీ షాక్

స్వదేశంలో టీమిండియాపై 2-0 తేడాతో టీ20 సిరీస్ ను సొంతం చేసుకుని 24 గంటల తిరగకముందే ఐర్లాండ్ కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు హెడ్ కోచ్ హెన్రిచ్ మలాన్ తన పదవికి రాజీనామా చేశారు. వచ్చే ఏడాది ఆరంభం వరకు తన పదవీ కాలం ఉన్నప్పటికి, వన్డే ప్రపంచకప్ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మలాన్ తెలిపారు. కొత్త కోచ్ కు జట్టు బాధ్యతలు అప్పగించడానికి ఇదే సరైన సమయమని అతడు పేర్కొన్నాడు.

గత రెండు వన్డే ప్రపంచకప్ లకు అర్హత సాధించలేకపోయిన ఐర్లాండ్ జట్టు, ఈసారి ఎలాగైనా వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ లో బరిలోకి దిగాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుతం ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ లో ఐర్లాండ్ 11వ స్థానంలో ఉంది.

ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలతో పాటు టాప్-8 స్థానాల్లో ఉన్న జట్లకు మాత్రమే ప్రపంచకప్ కు నేరుగా అర్హత లభిస్తుంది. మిగిలిన నాలుగు స్థానాల కోసం క్వాలిఫైయర్స్ మ్యాచ్ లు ఆడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ ఆధ్వర్యంలో జట్టును ప్రపంచకప్ కు సిద్ధం చేయాలని ఐర్లాండ్ భావిస్తోంది.

కాగా హెన్రిచ్ మలాన్ హయంలో ఐర్లాండ్ ఎన్నో అద్భుత విజయాలను అందించింది. వరుసగా మూడు టీ20 ప్రపంచకప్ లకు ఐరిష్ జట్టు క్వాలిఫై అయింది. 2022 టీ20 ప్రపంచకప్లో మెల్ బోర్న్ వేదికగా ఇంగ్లండ్ ను ఓడించి ఐర్లాండ్ సంచలనం సృష్టించింది. అంతేకాకుండా అతడి నేతృత్వంలోనే పాకిస్తాన్, వెస్టిండీస్, సౌతాఫ్రికా వంటి బలమైన జట్లను కూడా ఐర్లాండ్ మట్టికరిపించింది. ఇప్పుడు వరల్ నంబర్ వన్ టీ20 జట్టు అయిన టీమిండియాను ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది.

# పోస్టర్ తోనే మైండ్ బ్లాక్ చేసిన త్రివిక్రమ్-ఎన్టీఆర్!




మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్ లో ఓ భారీ మైథలాజికల్ చిత్రం రానుందనే వార్త గతకొంత కాలంగా సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. అయితే, వీరి కాంబినేషన్ లో ఓ సినిమా రానుందనే విషయం మాత్రం ఖాయమనే సంకేతాలు అందాయి. ఇప్పుడు ఈ వార్తను నిజం చేస్తూ మేకర్స్ ఈ కాంబోపై అధికారిక ప్రకటన చేశారు.

ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్ లో మైథలాజికల్ అంశాలతో ఓ భారీ పాన్ ఇండియా సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఓ థీమ్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ కు ‘‘శివుడి కుమారుడు, పార్వతి గర్వకారకుడు సుబ్రహ్మణ్య స్వామి’’ అనే క్యాప్షన్ తో ఆయుధం ఉన్న పోస్టర్ ను రిలీజ్ చేశారు. అంతేగాక, సంస్కృతంలో ఒక శ్లోకం కూడా ఈ పోస్టర్ లో మనకు కనిపిస్తుంది.

పోస్టర్ బ్యాక్ గ్రౌండ్ లో యుద్ధం తర్వాత కనిపించే సన్నివేశం మనకు కనిపిస్తుంది. దీంతో ఈ సినిమా పూర్తి మైథాలజీ నేపథ్యంలో సాగుతుందనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ లుక్స్ ఏ విధంగా ఉండబోతున్నాయా అనేది కూడా ఆసక్తికరంగా మారింది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆరట్స్ బ్యానర్లపై ఎస్.రాధాకృష్ణ, నందమూరి కళ్యాణ్ రామ్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తుండటం విశేషం.

# నాకు ఆ సంతృప్తి ముఖ్యం – సోనాక్షి



**‘దబాంగ్’ మూవీతో బాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది సోనాక్షి సిన్హా. మొత్తానికి మొదటి చిత్రంతోనే తన నటనతో, తన అందంతో సోనాక్షి సిన్హా మంచి ఫేమ్ నేమ్ సంపాదించుకుంది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ‘‘వందశాతం నేను ఎంచుకుంటున్న ప్రాజెక్ట్ లతో బలమైన మహిళా ప్రాధాన్య కథల వైపే నడుస్తున్నాను. కారణం.. ఒక నటిగా ఆనందాన్ని సంతృప్తిని ఇచ్చేదే నాకు ముఖ్యం. ‘సిస్టమ్’ సినిమా ప్రచారంలో దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారీ నన్ను హాలీవుడ్ దిగ్గజ నటీమణులతో పోల్చారు. వారిలా ఉండాలని నేను ప్రయత్నించకపోయినప్పటికీ.. ఎంతగానో ఆరాధించే, అభిమానించే దిగ్గజాలతో పోల్చడం మంచి అనుభూతినిచ్చిందని సోనాక్షి సిన్హా చెప్పుకొచ్చింది. ఏది ఏమైనా సోనాక్షి సిన్హా కమర్షియల్ చిత్రాలకు దూరంగా ఉంటూ అఖిరా, లుటేరా, ఫోర్స్ 2 లాంటి చిత్రాల్లో పెర్ఫార్మెన్స్ రోల్స్ తో అలరించింది. కానీ ఆ సినిమాలేవీ ఆమెకు కలిసి రాలేదు. దీంతో సోనాక్షి సిన్హా కెరీర్ కాస్త స్లో అయింది. ఈ లోపు సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్ ను పెళ్లి చేసుకుంది.**

# ‘విశ్వంభర’ కోసం మరోసారి సెట్స్‌లోకి చిరు.. ఎందుకంటే..?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం ‘విశ్వంభర’ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. దర్శకుడు వశిష్ట మల్లిడి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్ర షూటింగ్ ఎప్పుడో ముగిసింది. అయితే, ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది.

ఈ చిత్ర కథను మరింత ఎఫెక్టివ్ గా మార్చడంతో పాటు, క్లైమాక్స్ కు మరింత బలాన్ని చేకూర్చడం కోసం చిత్ర బృందం అదనంగా ఒక సీక్వెన్స్ చిత్రీకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీని కోసం చిరంజీవి మరో నాలుగు నుండి ఐదు రోజుల పాటు కాల్ షీట్లు కేటాయించనున్నాడట. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత ‘విశ్వంభర’ షూటింగ్ అధికారికంగా ముగుస్తుంది. ప్రస్తుతం చిరంజీవి దర్శకుడు బాబీ నేతృత్వంలో రూపొందుతున్న తన నెక్స్ట్ చిత్రం షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా షెడ్యూల్ మధ్యలో దొరికే చిన్న విరామంలో ఆయన ‘విశ్వంభర’ మిగిలిన భాగాన్ని పూర్తి చేయనున్నాడు. ఆ తర్వాత తన పూర్తి దృష్టిని మళ్లీ బాబీ ప్రాజెక్ట్ పైనే పెట్టనున్నాడు.

ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా ఎం.ఎం.కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్నాడు. మేకర్స్ ఈ చిత్రాన్ని దసరా కానుకగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. మరి ఈ చిత్ర రిలీజ్ డేట్ను మేకర్స్ ఎప్పుడు ప్రకటిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

## ‘ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు’..

# ఫ్యాన్స్‌కి గూస్ బంప్స్!

రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఇరుముడి చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుగా రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 21న రిలీజ్ కాబోతుంది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేశారు. ‘ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు..’ అంటూ సాగే ఈ పాట లిరిక్స్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయని ఫ్యాన్స్ పోస్ట్ లు పెడుతున్నారు.



అన్నట్టు, తమిళంలో ఈ చిత్రం ‘ఇరుముడికట్టు’ పేరుతో విడుదల కానుంది. ఇక ‘కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఒక కథే ఈ ఇరుముడి. ఇందులో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. కొత్త ప్రయాణంలో ఉత్సాహంగా ఉన్నా’’ అని రవితేజ ఆ మధ్య చెప్పుకొచ్చారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాకి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో బేబీ నకాస్త్ర రవితేజ కుమార్తెగా నటిస్తోంది.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.